ప్రతిపక్షం

www.prathipaksham.in

తొలి టీ20లో భారత్ ఘన విజయం 12

గురువారం 22.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 302 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

హైదరాబాద్ 24/7

దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

- జీసీసీ ప్రధాన కేంద్రంగా హైదరాబాద్
- మూసీ నది పునరుజ్జీవనం.. రివర్ ఫ్రంట్ అభివృద్ధి
- ప్రతి జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు
- దావోస్ వేదికపై సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన
- ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన సదస్సు
- 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో తెలంగాణ విజన్ ప్రదర్శన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ నది పునరుజ్జీవనంతో పాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేసి నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి పెడుతామని చెప్పారు. దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్ ను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు

...:: మిగతా 2లో

గుంపు మేస్త్రి, గుంటనక్క ఫోన్ ట్యాపింగ్ విచారణ నాటకం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం డైవర్ట్ చేయడానికే

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీసీలను మోసం చేస్తున్నాయి
- సికింద్రాబాద్ జిల్లా కోసం కేటీఆర్ కొత్త డ్రామా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపాటు
- ముచ్చర్ల సత్యనారాయణ బడుగుల నాయకుడు
- జాగృతి కార్యాలయంలో ఆయన జయంతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: తెలంగాణలో జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ విచారణ గుంపు మేస్త్రి, గుంటనక్క కలిసి ఆడుతున్న నాటకం అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం ప్రజల ముందుకు రాకుండా డైవర్ట్ చేయడానికే కావాలనే ఈ విచారణను తెరపైకి తీసుకొచ్చారని ఆమె ఆరోపించారు. ఈ విచారణ ద్వారా తనలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం తనకు లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ

...:: మిగతా 2లో

సామాన్యుని పాలిట బడ్జెట్ వరమా?

ఈ సారి బడ్జెట్ లో 30 శాతం ఇన్‌కమ్ ట్యాక్స్ స్లాబ్ ను సవరించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. దీనిపై సామాన్యుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి. ప్రస్తుతం ట్యాక్స్ స్లాబ్స్ ప్రకారం..ఆదాయం ఒక పరిమితి దాటితే 30 శాతం పన్ను కట్టాల్సి వస్తోంది.

11

ఢిల్లీలో హై అలర్ట్..

ఢిల్లీలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దేశం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతుండగా ఉగ్రవాదులు దేశ రాజధానిని రక్తసిక్తం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి.

11

రాష్ట్రానికి పెట్టుబడుల వరద

రష్మి గ్రూప్ రూ.12,500 కోట్లు.. సర్గడ్ సంస్థ రూ.1000 కోట్లు

- మూసీ నది పునరుజ్జీవనంలో టాటాగ్రూప్
- రాష్ట్రంలో ఏబీ ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణ
- హైదరాబాద్‌లో బ్యూటీ-టెక్ జీసీసీ
- హైదరాబాద్‌లో 'స్విస్ మాల్' ఏర్పాటు
- దావోస్‌లో ఆకర్షణగా చిరంజీవి

...:: 2లో

16 మందికి కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి

- కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, రాజేశ్‌కుమార్ యాదవ్ ఉత్తర్వులు

జీవీ శ్యామ్ ప్రసాదలాల్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: తెలంగాణ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 16 మంది అధికారులకు కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర వ్యవహారాల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులను వారి సర్వీస్, పనితీరు, ఖాళీల ఆధారంగా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ కేడర్‌లోకి ప్రమోట్ చేయడాన్ని కన్ఫర్డ్ ఐఏఎస్ అంటారు. అర్హత, సీనియారిటీ, నిబంధనల మేరకు పదోన్నతి కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో పంపిన ఖాళీల వివరాల

...:: మిగతా 2లో

గ్రీన్‌లాండ్‌కు అమెరికానే దిక్కు..

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక-సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌లాండ్ ను స్వాధీనం చేసుకోవాలన్న తన కోరికను మరోసారి బయటపెట్టాడు.

11

రాష్ట్రంలో 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

- బదిలీ చేస్తూ పురపాలకశాఖ ఉత్తర్వులు
- తక్షణమే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు
- మున్సిపల్ ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏకంగా 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే

...:: మిగతా 2లో

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి

- జిల్లాల తొలగింపు, కాంగ్రెస్ హామీల మోసం
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన అస్త్రం
- ఎన్నికలకు బీఆర్ఎస్ పూర్తి సన్నద్ధం
- ఫార్ములా- ఈ అంటారు, దావోస్‌లో గ్రీన్‌కోతో చర్చలు చేస్తారు
- కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి
- గ్రీన్‌కోను కాపాడేందుకు బ్యాగులు తీసుకుంటున్నారా?
- దావోస్‌లో గ్రీన్ కోతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారా?
- ఫ్యూచర్ లేని'ఫ్యూచర్ సిటీ'పై సీఎం సమాధానం చెప్పాలి
- సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- మీడియా చిట్ చాట్లో కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే జిల్లాల తొలగింపునకు ప్రజలు అనుమతి ఇచ్చినట్లేనని, ఈ అంశాన్ని ప్రజలు స్పష్టంగా గుర్తించి రాబోయే పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త జిల్లాల్లో ఇప్పటికే జిల్లాలు ఎత్తేస్తారన్న భయం నెలకొందని, ప్రజల్లో తీవ్ర ఆందోళన ఉన్నదని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం మున్సిపాల్టీల వారీగా పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించనున్నామని, ఉమ్మడి జిల్లాలకు చెందిన వారినే బాధ్యతల్లో పెడతామని కేటీఆర్ తెలిపారు. రేపు లేదా ఎల్లుండి ఇన్‌చార్జ్‌లను ప్రకటిస్తామని చెప్పారు. ఇప్పటికే జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు పూర్తయ్యాయని, ఎన్నికలకు పార్టీ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఎన్నికల కోసం

...:: మిగతా 2లో

తల్లుల సన్నిధిలో పులకింత

- మేడారానికి లక్షల్లో తరలివచ్చిన భక్తులు
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు
- గద్దెల వద్ద సులభంగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు

జనవరి 21: మేడారం సమ్మక్క సారలమ్మల గద్దెలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకున్నారు. బుధవారం ఒక్క రోజే సుమారు లక్ష మందికి పైగా వచ్చిన భక్తులతో మేడారం పరిసరాలు రద్దీగా మారిపోయాయి. వాహనాలతో జాతర దారులు రద్దీగా మారాయి. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. కాలినడకన గద్దెలకు చేరుకుని ఎత్తు బంగారం(బెల్లం), చీరె సారె, పసుపు, కుంకుమ,

...:: మిగతా 5లో

సింగరేణి బకాయిలు ఎప్పుడిస్తారు?

- సంస్థ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలి
- నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్‌పాలనలో అక్రమాలు
- రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే చర్యలకు కేంద్రం సిద్ధం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 21: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.47 వేల కోట్ల బకాయిలు ఎప్పుడిస్తారో చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి భూముల్లో అనేక ఆక్రమణలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే చర్యలకు కేంద్రం సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణకు గుండెలాంటి సింగరేణి.. ఇప్పుడు అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిని బంగారుబాతులా కాంగ్రెస్ వాడుతోందన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గు అందించాలని.. కేంద్రం నైనీ కోల్ బ్లాక్‌ను కేటాయించిందని, కోల్ బ్లాక్‌కు కేంద్రం అన్ని అనుమతులు ఇచ్చిందని స్పష్టం చేశారు. అయితే, టెండర్లు పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నాన్చుతోందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. టెండర్లు రద్దు చేయడమంటే సింగరేణికి అన్యాయం చేసినట్లేనన్నారు.

సైట్ విజిట్‌కు.. సింగరేణి సర్టిఫికెట్ ?

సైట్ విజిట్‌కు.. సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టారని, అయితే సైట్ విజిట్ అనేది సెల్ఫ్

...:: మిగతా 2లో

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

రూపాయి పతనం కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. బుధవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూపాయి విలువ 91.74 వద్ద కనిష్ఠానికి చేరింది.

11

రాజకీయం

హైదరాబాద్.. 24/7

మొదటిపేజీ తరువాయి

ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. అదే వేదికపై తెలంగాణ ఏఐ. ఇన్నోవేషన్ హబ్, తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలోఅప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు సూచించారు. హైదరాబాద్లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించిందని సీఎం తెలిపారు. 'ప్రతి ఏడాది మేము ఎంవోయూలపై సంతకాలు చేయడానికి దావోస్ కు వస్తాం.. కానీ ఈసారి గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటంతో, తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి చూపించడానికి వచ్చాం" అని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్ లో మెట్రో రైలు విస్తరణ, చెర్వులు కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్‌చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ అర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. తెలంగాణకు అపారమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, సాంకేతికత, అనుభవం, నైపుణ్యాల పరంగా గ్లోబల్ కంపెనీల సహకారం స్వీకరిస్తామని అన్నారు. ప్రముఖ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యమంత్రితో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు.

16 మందికి కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి

మొదటిపేజీ తరువాయి

ఆధారంగా కేంద్రం తాజాగా 16 మందికి ప్రమోషన్ కల్పించింది. డి మధుసూదన్‌నాయక్, ఎం సత్యవాణి, జె భవాని శంకర్, జె లింగ్యా నాయక్, ఏ నర్సింహా రెడ్డి, జీ వీరారెడ్డి, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్, రఘురామ్‌శర్మ, పి చంద్రయ్య, జీ ముకుంద రెడ్డి, ఏ భాస్కర్ రావు, వైవీ గణేశ్, అబ్దుల్‌హమీద్, బీ వెంకటేశ్వర్లు, ఎన్ కీమ్యా నాయ్, కె గంగాధర్‌కన్ఫర్డ్ ఐఏఎస్లుగా ప్రమోషన్ పొందారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రాజేశ్‌కుమార్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

సింగరేణి బకాయిలు ఎప్పుడిస్తారు?

మొదటిపేజీ తరువాయి

సర్టిఫికేషన్ నిబంధనని పేర్కొన్నారు. కానీ.. సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టడమేంటి? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. నచ్చినవారికి నైనీ కోల్ బ్లాక్ ఇవ్వాలని చూస్తున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ , ఇప్పుడు కాంగ్రెస్ సింగరేణిని వాడుకుంటున్నాయని, లాభాల బాటలో ఉన్న సింగరేణిని సమస్యల నిలయంగా మార్చారని కిషన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. నచ్చిన వారికి విజిట్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని, సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చేశారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

సింగరేణిలో పెత్తనం రాష్ట్రానిదే

సింగరేణిలో కేంద్రం వాటా 49%.. కానీ పెత్తనం రాష్ట్రానిదని విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వానికి ఏ రకమైన అధికారం లేదని, ఏడుగురు డైరెక్టర్లలో కేంద్రం నుంచి ఇద్దరే ఉంటారని తెలిపారు. సీఎండీ నియామకం కూడా రాష్ట ప్రభుత్వం చేతిలో ఉందన్నారు. కేసీఆర్ హయాంలో ఆడిందే ఆటగా కొనసాగిందని, రాజకీయ జోక్యంతో సింగరేణిని సమస్యల్లోకి నెట్టివేశారని ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల చెమట, రక్తాన్ని దోచుకుంటున్నారని అన్నారు. ఈ విషయంపై సీబీఐ విచారణ జరపాలంటున్నారని అయితే అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కూడా కావాలని తెలిపారు. ఈ వివాదంలోకి అనవసరంగా తనను లాగుతున్నారన్నారు.

సీబీఐ దర్యాప్తు జరగాలి

బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని విధ్వంసం చేస్తున్నాయన్నారు. అక్రమ లావాదేవీలు, తెరవెనుక ఒప్పందాలు.. సింగరేణి భవిష్యత్‌ను ప్రమాదంలో పడేస్తున్నారని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే.. సింగరేణి వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. గతంలో తాడిచర్ల కోల్ బ్లాక్‌ను కేంద్రం జెన్‌కోకు కేటాయించిందని, మైనింగ్ చేస్తామని సింగరేణి ముందుకొస్తే బీఆర్ఎస్ బెదిరించిందన్నారు. తాము మైనింగ్ చేయబోమని బలవంతంగా లేఖ ఇప్పించిందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రైవేట్ సంస్థలకు వెళ్లేలా నాడు బీఆర్ఎస్ వ్యవహరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పంథా కొనసాగిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణిని పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు. సింగరేణి అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

రూ.47 వేలకోట్ల బకాయిలు ఎప్పుడిస్తారు?

నైనీ కోల్ బ్లాక్ విషయంలోనే కాకుండా.. పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలని కిషన్‌రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే సీబీఐ దర్యాప్తుపై కేంద్రం పరిశీలిస్తుందన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.47 వేలకోట్ల బకాయిలు చెల్లించాలని, ఆ బకాయిలు ఎప్పుడిస్తారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు క్వాలిటీ తగ్గిపోయిందన్నారు. సింగరేణి బొగ్గును చాలా రాష్ట్రాలు వద్దంటున్నాయని, సింగరేణి సంస్థ ఉనికే ప్రమాదకర స్థాయికి చేరిందన్నారు. సింగరేణి భూముల్లో అనేక ఆక్రమణలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే చర్యలకు కేంద్రం సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి

మొదటిపేజీ తరువాయి

అవసరమైన ప్రచార మెటీరియల్ అంతా సిద్ధంగా ఉందని, అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థుల ఎంపిక చేయాలని నేతలకు సూచించామని తెలిపారు. సర్వేలు కూడా చేయిస్తున్నామని, వాటి ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. స్థానిక నేతల ఆధ్వర్యంలోనే ఎన్నికల ప్రచారం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచ్ స్థానాలు గెలవడం సామాన్యమైన విషయం కాదని కేటీఆర్ అన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారని తాము అనుకోవడం లేదని, అయినప్పటికీ మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ అత్యంత సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఇప్పటికే 'బస్తీ బాట' కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లి, గత పదేళ్లలో తాము చేసిన అభివృద్ధి పనులు, కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిన పనులు, ప్రస్తుత సమస్యలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. జిల్లాలు తొలగిస్తారన్న ఆందోళన కొత్త జిల్లాల్లో తీవ్రంగా ఉందని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే జిల్లాల తొలగింపునకు అనుమతి ఇచ్చినట్లేనని ప్రజలకు వివరించనున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ అంశాన్ని మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఏమి చేసినా అది ఆయన ఇష్టమని, తమ పని తాము చేసుకుంటామని అన్నారు. సీఎం కాలికి బలపం కట్టుకొని తిరిగినా సర్పంచ్ ఎన్నికల్లో ఎన్ని స్థానాలు వచ్చాయో ప్రజలందరూ చూశారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా బీఆర్ఎస్‌కే ఓటు వేయమని చెబుతున్న పరిస్థితి ఉందని అన్నారు. తమ ఇన్‌చార్జ్‌లను ఇప్పటికే నియమించామని, పార్టీ తన పనిలో తాను నిమగ్నమై ఉందని స్పష్టం చేశారు. లేని 'ఫ్యూచర్ సిటీ' పేరుతో జంట నగరాల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లో స్థానికులు చేస్తున్న ఉద్యమానికి సీఎం జవాబు ఇవ్వాలని అన్నారు. చాలా చోట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన ఉందని, కొత్త జిల్లాలు చేసిన పట్టణాల్లో జిల్లాలు ఎత్తేస్తారన్న భావన ప్రజల్లో బలంగా ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ప్రచారం వంటి నిర్ణయాలు స్థానిక నాయకులే తీసుకుంటారని తెలిపారు. ఎన్నికల కోఆర్డినేటర్లను నియమిస్తున్నామని, టికెట్లు ఎవరికి ఇవ్వాలన్నది వారే నిర్ణయిస్తారని చెప్పారు. ఎన్నికలు లేని నాయకులు, ఎమ్మెల్యేలను మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తామని వెల్లడించారు. లోకల్ ఎన్నికలు కావడంతో స్థానికులే ప్రచారం చేస్తారని, స్థానిక సమస్యలనే ఎజెండాగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. దావోస్ లో గ్రీన్ కోతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారా? లోపల లోపల డీల్స్ మాట్లాడుకుంటున్నారా? 'ఫార్ములా-ఈ' విషయంలో గ్రీన్‌కోకు లబ్ధి చేకూర్చామంటూ ఆరోపణలు చేస్తున్నారని, అయితే అదే గ్రీన్‌కోతో దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోందని కేటీఆర్ విమర్శించారు. గ్రీన్‌కోను కాపాడేందుకు బ్యాగులు తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. దావోస్‌లో ఏపీ బీజేపీ ఎంపీ సహా పలువురితో మంత్రులు చర్చలు జరుపుతున్నారని, ఇది ఏ విషయానికి సంకేతమని నిలదీశారు. ఒకవైపు 'ఫార్ములా-ఈ' కుంభకోణం అంటారని, ఆధారాలు చూపాలని, మరోవైపు అదే అంశంపై విచారణ అంటూనే దావోస్‌లో గ్రీన్‌కోతో చర్చలు జరుపుతారని విమర్శించారు. ఒకచోట మంచోళ్లుగా, మరోచోట చెడ్డోళ్లుగా ఎలా వ్యవహరిస్తారని నిలదీశారు. దావోస్ లో గ్రీన్ కోతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారా? లోపల లోపల డీల్స్ మాట్లాడుకుంటున్నారా? లేకపోతే నీ మీద కేసులో నుంచి తీసేస్తాను డబ్బులు ఇయ్యి అని బెదిరిస్తున్నారా? ఏం చేస్తున్నావు అక్కడ? చెప్పండి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ మరోసారి డిమాండ్ చేశారు. ఎప్పటి నుంచి విచారణ చేసినా తమకు అభ్యంతరం లేదని, సింగరేణిపై మంత్రులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సిట్టింగ్ జడ్జిని వేయించి, సింగరేణి మీద మీరు ఎప్పటి నుంచి చేస్తామంటే అప్పటి నుంచి విచారణ చేయండి మాకు అభ్యంతరం లేదన్నారు. 2014 నుంచి విచారణ చేయండి. కాకపోతే 'విజిట్ సైటేషన్ సర్టిఫికేట్' అనే పనికిమాలిన నిబంధన ఎందుకు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కార్పొరేషన్ ఒక్కటే ఉండేదని, తాము ఏమీ మార్చలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశాలపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని, సమాధానం చెప్పేవరకు ఆయన వెంబడి పడతామని అన్నారు. రేవంత్‌లో 'రాము' ఉన్నాడు, 'రెమో' ఉన్నాడని వ్యాఖ్యానిస్తూ, ఒకవైపు సినిమా టికెట్లు పెంచమని చెబుతూనే మరోవైపు టికెట్లు పెంచుతూ జీఓలు ఇస్తారని విమర్శించారు. సర్వాయి పాపన్న పేరుతో జనగామ జిల్లా చేస్తామని చెప్పి, ఇప్పుడు అదే జిల్లాను తొలగిస్తామని అనడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

అలంపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం దారుణం, అప్రజాస్వామికం. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధిపై దాడి చేయడం అంటే ప్రజల తీర్పుపైనే దాడి చేసినట్టే. ఈ ఘటనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. మల్లు రవి తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బెదిరించడం, దాడులు చేయడమేనా ప్రజా పాలన? ఈ ఘటనకు బాధ్యుడైన మల్లు రవిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

- మాజీ మంత్రి హరీశ్ రావు

రాష్ట్రానికి పెట్టుబడుల వరద

- రష్మి గ్రూప్ రూ.12,500 కోట్ల పెట్టుబడులు
- సర్గడ్ సంస్థ రూ.1000 కోట్లతో పెట్టుబడులు
- మూసీ నది పునరుజ్జీవనంలో టాటాగ్రూప్
- రాష్ట్రంలో ఏబీ ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణ
- హైదరాబాద్‌లో బ్యూటీ–టెక్ జీసీసీ
- హైదరాబాద్‌లో 'స్విస్ మాల్' ఏర్పాటు
- దావోస్‌లో ఆకర్షణగా చిరంజీవి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలి 'స్విస్ మాల్'

స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్‌తో సీఎం రేవంత్‌కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో భారత్–స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సహకార పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్–2047 విజన్‌ను స్విస్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి 'స్విస్ మాల్' ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి ప్రతిపాదించగా, స్విస్ బృందం వెంటనే సానుకూలంగా స్పందించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు ఫుట్‌బాల్ ఆటగాళ్లే కావడంతో, క్రీడల రంగంలో భాగస్వామ్యంపై కూడా విస్తృతంగా చర్చించారు. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిలో కలిసి పనిచేయవచ్చని అభిప్రాయపడ్డారు.సంస్కృతి, విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ రంగాల్లో.. ముఖ్యంగా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, క్రీడల విభాగాల్లో.. పరస్పర సహకారానికి అవకాశాలపై లీడర్లు అభిప్రాయాలు పంచుకున్నారు. రిటైల్ , లైఫ్ సైన్సెస్‌లో రంగాల్లో అవకాశాలపై చర్చించారు. మహిళా సాధికారతకు సంబంధించి స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలపై స్విస్ బృందం ఆసక్తి కనబరిచింది. సహకార అంశాలు పరిశీలించేందుకు త్వరలోనే స్విట్జర్లాండ్ బృందం హైదరాబాద్‌కు వస్తుందని వాడ్ రాష్ట్ర పరిశ్రమలు, ఆర్థిక శాఖ మంత్రి ఇసబెల్ మోరెట్ తెలిపారు.

హైదరాబాద్, జనవరి 21: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం దావోస్ పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడుల పరంపర కొనసాగుతూనే ఉంది. మొన్న గూగుల్, యూనిలివర్ వంటి అంతర్జాతీయ కంపెనీలు ముందుకు వస్తే బుధవారం మరికొన్ని దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు క్యూ కట్టాయి. డీఐ పైపుల సంస్థ రష్మి గ్రూప్ రూ.12,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. స్టీల్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల మేర ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది.

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం

దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో న్యూక్లర్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047 నాటికి నెట్-జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సుమారు 300 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేసే అవకాశాలను న్యూక్లర్ సంస్థ పరిశీలిస్తోంది. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ చైర్మన్ డా. జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ, డైరెక్టర్ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ , డైరెక్టర్ మొలుగు శ్రీపాల్ రెడ్డి, స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ రూ. 6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి ముందుకొచ్చింది.

మూసీ నది పునరుజ్జీవనంలో టాటాగ్రూప్

హైదరాబాద్‌లో స్టేడియాల అప్‌గ్రేడేషన్‌కు టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్‌లో టాటా గ్రూప్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని టాటా గ్రూప్ చైర్మన్‌ను సీఎం కోరారు. మూసీ నది పునరుజ్జీవనంలో భాగస్వామ్యానికి రాష్ట్రంలో హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటుపై చంద్రశేఖరన్ ఆసక్తి చూపారు. రాష్ట్రంలో కొత్త మానుఫాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు కోసం చర్చలు జరిపారు. విజన్-2047 లక్ష్యాలు పెట్టుబడులకు ఉన్న అనుకూల విధానాలను ఈ సందర్భంగా టాటా గ్రూప్ చైర్మన్‌కు సీఎం వివరించారు.

సర్గడ్ సంస్థ రూ.1000 కోట్లతో..

విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థ రూ.1000 కోట్లతో తెలంగాణలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్ (ఎమ్ఆర్‌వో) నెలకొల్పనుంది. రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో దశలవారీగా వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో సర్గడ్ సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సర్గాడ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీనివాస్ తోట భేటీ అయ్యారు. ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో అనుభవం ఉన్న సర్గాడ్ సంస్థ రాష్ట్రంలో విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు.

తెలంగాణలో ఏబీ ఇన్‌బెవ్ యూనిట్ విస్తరణ

ప్రపంచంలో అతిపెద్ద బీరు తయారీ సంస్థగా పేరుగాంచిన ఏబీ ఇన్‌బెవ్, తెలంగాణలో ఇప్పటికే ఉన్న తన తయారీ యూనిట్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఏబీ ఇన్‌బెవ్ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ జాన్ బ్లడ్తో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్, సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది.

ప్రపంచంలోనే తొలి బ్యూటీ–టెక్ జీసీసీ

ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్లో ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ-టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించింది.

దావోస్‌లో ఆకర్షణగా చిరంజీవి

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి తో కలిసి ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న సీఎం సదస్సుకు రావాలని వెంటనే ఆహ్వానించారు. దీంతో ఆయన సదస్సుకు హాజరయ్యారు. వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిరంజీవితో సీఎం రేవంత్ మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులతో కలిసి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా వీక్షించానని, ఎంతో ఆస్వాదించానని చెప్పారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్ వెళ్లారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

మొదటిపేజీ తరువాయి

క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు సొంత జిల్లాల్లో ఉన్నవారిని, అలాగే ఒకే చోట మూడేళ్లు దాటిన వారిని మార్చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రామగుండం గ్రేడ్ 3మున్సిపల్ కమిషనర్ గా సీవీఎన్ రాజు, రాయికల్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా కీర్తి నాగరాజు, హాలియా గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి, అమరచింత గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా నురుల్ నజీబ్, వేములవాడ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా సంపత్ కుమార్, ములుగు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా రమేష్ బదిలీ అయ్యారు. తిరుమలగిరి గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా రామ చంద్ర రావు, ఆదిలాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా జీ రాజు, ఎదులపురం గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా మునవార్, బెల్లంపల్లి గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా సంపత్, భూత్పూర్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా చంద్రశేఖర్ రావు, నడికొండ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా మురళి, అచ్చంపేట గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ వేణు లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కల్లూరు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా రామదుర్గ రెడ్డి, హుజూర్ నగర్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా బీ శ్రీనివాస్, చొప్పదండి గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా టీ మనోహర్, హుజురాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా ముసబ్ అహ్మద్, మంచిర్యాల గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా జి అన్వేష్, ఆలేరు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి, మొయినాబాద్ గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా జకీర్ అహ్మద్ తో పాటు మరో 27 మంది బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

గుంపు మేస్త్రి, గుంటనక్క.. ఫోన్ ట్యాపింగ్ విచారణ నాటకం

మొదటిపేజీ తరువాయి

జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కవిత మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముచ్చర్ల సత్యనారాయణ బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేసిన నాయకుడని ఆమె గుర్తుచేశారు. ఆయన లాంటి ఎంతో మంది ఉద్యమ నేతలకు గత ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఆంధ్రా నాయకుల విగ్రహాలను తొలగించాలనే ఉద్దేశం లేదని, కానీ తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలు తప్పకుండా ట్యాంక్‌బండ్‌పై ఉండాలన్నారు. అమరజ్యోతిపై అవినీతి మరకలు అంటాయని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అయితే ఇప్పటి వరకు దానిపై ఎలాంటి విచారణ జరపలేదని కవిత విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుల జయంతులు, వర్ధంతులు నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ జాగృతి ఒక రోజు అధికారంలోకి వచ్చినప్పుడు తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి జయంతి, వర్ధంతులను ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. బీసీలకు గ్రామపంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా 42 శాతం రిజర్వేషన్ల మాట ఎత్తకుండానే ముందుకు వెళ్తోందని ఆరోపించారు. పట్టణాల్లో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు ఈ అంశాన్ని ప్రశ్నించకుండా ఉండేందుకే ఫోన్ ట్యాపింగ్ డ్రామాను తెరపైకి తెచ్చారని అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కలిసి బీసీలను మోసం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలకు తొందరేమీ లేదని, ముందుగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలని ఆమె డిమాండ్ చేశారు. మెజార్టీ ప్రజలకు రాజ్యాధికారం ఉన్నప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. జాగృతి ఇంకా పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా మారలేదని, అయినప్పటికీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, యువత, మహిళలు ఎవరైనా తమను సంప్రదిస్తే మద్దతు ఇస్తామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం

చేపట్టబోయే కులగణన ద్వారా కాంగ్రెస్ చేసిన మోసాన్ని బయట పెట్టే అవకాశం వచ్చిందని కవిత పేర్కొన్నారు. బీసీ కులాల సంఖ్యను తక్కువగా చూపిస్తూ కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. జాగృతి తరపున ప్రతి బీసీ కులం, ఉపకులాలకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించి అన్యాయం జరగకుండా నివేదిక సిద్ధం చేస్తామని తెలిపారు. త్వరలో బీసీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది అన్‌సంగ్ హీరోలు ఉన్నారని, వారి త్యాగాలు భవిష్యత్ తరాలకు తెలిసేలా జాగృతి కృషి చేస్తుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ఫస్ట్ అన్నదే తమ నినాదమని, తెలంగాణ కోసం పనిచేసిన వారిని పార్టీతో సంబంధం లేకుండా గౌరవిస్తామని చెప్పారు.

సికింద్రాబాద్ జిల్లా కోసం కేటీఆర్ కొత్త డ్రామా

సికింద్రాబాద్ జిల్లా కోసం కేటీఆర్ కొత్త డ్రామాలడుతున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. "బీఆర్ఎస్‌హయాంలో సికింద్రాబా ద్ జిల్లా కావాలని అడిగినోళ్లను అణచివేశారు. అలాంటిది ఇప్పుడు సికింద్రాబాద్ జిల్లా కావాలని కేటీఆర్ అడగడం విడ్డూరంగా ఉంది" అని విమర్శించారు. జిల్లాల పునర్విభజన ఇప్పుడు జరగదని కేంద్రం గతంలోనే తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన ఎప్పుడు జరిగినా సికింద్రాబాదు జిల్లా చేయాల్సిందేనని, కొత్త జిల్లాల్లో ఏదో ఒక దానికి పీవీ నర్సింహారావు పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య విద్య

- ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్
- ఉస్మానియాలోనైనా, ఆసిఫాబాద్‌లోనైనా ఒకే స్థాయి విద్య
- అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సంప్రదాయ విద్యా విధానంతో పాటు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఎడ్యుకేషన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వైద్య విద్యలో సాంకేతికతను జోడించడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించవచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఎడ్యుకేషన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

విద్యా ప్రమాణాలపై పటిష్ట చర్యలు

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఏటా 4,140 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్నారని, రాష్ట్రంలో కాలేజీల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యా ప్రమాణాలపై ఎటువంటి రాజీలేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చదివిన వైద్యులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, అదే స్థాయి బోధనను కొత్తగా ఏర్పాటైన జిల్లాల కాలేజీల్లోనూ అందించాలని సూచించారు. 'ఉస్మానియా విద్యార్థికైనా, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీ విద్యార్థికైనా ఒకే రకమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలి. మెడికోలకు కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం చేయకుండా, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించాలి. ఇందుకోసం ప్రతి మెడికల్ కాలేజీలో ప్రాథమిక స్థాయి నుంచే డిజిటల్ మౌళిక వసతులను కల్పించాలి. తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పరీక్షించేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకోవాలి. క్లిష్టమైన అనాటమీ, సర్జికల్ ప్రొసీజర్ల పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వర్చువల్ ల్యాబ్స్, సిమ్యులేషన్ టూల్స్, వర్చువల్ రియాలిటీ వంటి అధునాతన పద్ధతులను వినియోగించాలి' అని మంత్రి ఆదేశించారు.

సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా..

రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ఉస్మానియా, గాంధీ, వరంగల్ ఎంజీఎం కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కేంద్రాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి భవిష్యత్ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారించి, వీటిని ఇతర కళాశాలలకు మెంటార్/శిక్షణా కేంద్రాలుగా మార్చాలని సూచించారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పాఠ్యాంశాలను డిజిటల్ రూపంలోకి మార్చి, నేషనల్ డిజిటల్ లైబ్రరీతో అనుసంధానం చేయాలి. బోధనాసుపత్రుల్లోని రద్దీ దృష్ట్యా, విద్యార్థులకు క్లినికల్ కేస్ స్టడీలను వివరించేందుకు టెలీమెడిసిన్ విధానాన్ని వినియోగించుకోవాలని, ప్రతి కళాశాలలో అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌తో పాటు ఐటీ అడ్మినిస్ట్రేటర్లు, టెక్నీషియన్లను నియమించాలని ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు జరగాలి. విద్యార్థుల హాజరు, పనితీరును ఏఐ టూల్స్ ద్వారా నిరంతరం విశ్లేషించాలన్నారు. మన వైద్య విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా రాణించేలా వారిని తీర్చిదిద్దడమే ఈ డిజిటల్ విధానం ప్రధాన ఉద్దేశమని మంత్రి పునరుద్ఘాటించారు.

పురపాలక ఎన్నికల్లో సత్తా చాటాలి

- రాష్ట్ర మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నిజామాబాద్ లోక్ సభ కాంగ్రెస్ నాయకులతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: రానున్న పురపాలక సంఘం ఎన్నికల్లో సత్తా చాటి ప్రతి పురపాలక సంఘంపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మ్రోగించిందని అదే ఒరవడితో పురపాలక సంఘం ఎన్నికల్లో విజయభేరీ మ్రోగించాలని ఆయన కోరారు. బుధవారం సాయంత్రం గాంధీ భవన్‌లో జరిగిన నిజామాబాద్ లోక్ సభ పరిధిలోని కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన పార్లమెంట్ ఇంచార్జ్ మంత్రిగా పాల్గొని, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌తో కలిసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికకు ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు సాధిస్తుందని ఇదే స్ఫూర్తి పురపాలక సంఘం ఎన్నికల్లోనూ కొనసాగించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు. అదే సమయంలో పురపాలక సంఘం ఎన్నికలు అంటే ఆషామాషీ వ్యవహారం కాదని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేసినప్పుడే మెరుగైన ఫలితాలకు ఆస్కారం ఉంటుందన్న అంశాన్ని ఏ ఒక్కరు విస్మరించకూడదని ఆయన ఉద్బోధించారు. జిల్లాలోని మున్సిపాలటీలను క్లీన్‌స్వీప్‌చేయాలని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నేతలందరూ సమన్వయంతో పని చేసి పార్లమెంట్ పరిధిలోని పురపాలక సంఘాలలో విజయఢంకా మ్రోగించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో నిజామాబాద్‌నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి బీసీ ఉద్యోగులు కృషి చేయాలి

- బీసీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి బీసీ ఉద్యోగులు, కార్మికులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందడంతో పాటు ఆర్టీసీని లాభాల బాట పట్టించడంలో బీసీ ఉద్యోగులు శక్తివంచన లేకుండా పని చేయాలని రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఈ నిరంజన్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థను కాపాడుకోవడంలో బీసీ ఉద్యోగులు ముందు వరుసలో ఉండాలని, ఇదే సమయంలో ఆర్టీసీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగ, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఆర్టీసీలో ఎస్సీ, ఎస్టీ ఇతర సామాజిక వర్గ ఉద్యోగులకు ఏ విధంగా ఆర్టీసీ సంస్థ అండగా ఉంటుందో అదే విధంగా బీసీ ఉద్యోగులకు కూడా ఆర్టీసీ సంస్థ అండగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఆర్టీసీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగ కార్మికులు ఐక్యమత్యంతో మెలగాలని, ఐక్యమత్యం ద్వారానే బీసీలు అభివృద్ధి చెందుతారని పొన్నం అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న వేలాదిమంది బీసీ ఉద్యోగ కార్మికులు చైతన్యంతో పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వెంకటేష్ గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గయ్య, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్, వెంకటయ్య, ఉపేందర్ యాదవ్, లక్ష్మయ్య యాదవ్, శ్రీనివాస్, గిరి స్వామి, తారకేశ్వరి, సంధ్యారాణి, నరసింహ చారి, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి సహ్యాద్రి ఫార్మ్స్ సహకారం కావాలి

- రైతు కమిషన్ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- సహ్యాద్రి ఎండీ విలాస్ షిండేతో పలు అంశాలపై చర్చ
- రైతు కమిషన్ బృందం రెండో రోజు నాసిక్ పర్యటన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: తెలంగాణ రైతు కమిషన్ బృందం నాసిక్ లో రెండో రోజు పర్యటన కొనసాగించింది. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి పంటల సాగు విధానం, సాగుకయ్యే ఖర్చు, మార్కెటింగ్, లాభ నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఇక సహ్యాద్రి ఎండీ విలాస్ షిండే తో కమిషన్ బృందం సాయంత్రం భేటీ అయ్యింది. రెండు రోజులుగా నాసిక్ ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషన్ బృందానికి విలాస్ షిండే స్వాగతం పలికారు. సహ్యాద్రి క్యాంపస్‌లో దాదాపు 2 గంటల పాటు పలు అంశాలపై చర్చించారు. దక్షిణ భారత్ దేశంలో ప్రధానంగా తెలంగాణ లాంటి రాష్ట్రానికి సహ్యాద్రి ఫార్మ్స్ సహకారం కావాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కోరారు. తెలంగాణలో గోదావరి, కృష్ణ నదులతోపాటు గొలుసుకట్టు చెరువులు ఉన్నాయని, అన్ని రకాల పంటల సాగుకు సారవంతమైన భూమి ఉందని, వాతావరణం సైతం అనుకూలంగా ఉంటుందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాలను విలాస్ షిండే కు కోదండరెడ్డి వివరించారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్.. విజన్ 2047లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చిన విషయం సైతం గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ వేస్తున్నారని తెలిపారు. ఆ దిశగానే సీఎం ప్రస్తుతం దావోస్ లో వున్నారని వివరించారు. సీఎం ఆదేశాల మేరకు కమిషన్ బృందం ఇతర రాష్ట్రాల్లో పర్యటిస్తుందని తెలిపారు. బలమైన ఎఫ్‌పీఓ లు ఏర్పాటు కావాలని, దానికోసం మీలాంటి వారు తెలంగాణకు రావాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సహ్యాద్రి ఎండీ విలాస్ షిండే ను కోరారు. కమిషన్ సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డిలు మాట్లాడుతూ దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణలోనే రైతు సంక్షేమ కమిషన్ ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయంపై మక్కువతో కమిషన్ ఏర్పాటు చేశారని, వ్యవసాయం పై అనుభవం వున్న చైర్మన్ కోదండరెడ్డి ఉండడం కూడా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ములుగు, గద్వాల్ జిల్లాలో విత్తనోత్పత్తి చేసి నష్టపోయిన రైతులకు కమిషన్ చొరవ తీసుకొని కంపెనీల నుండి నష్టపరిహారం ఇప్పించినట్లు వివరించారు. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో సాగిన పర్యటనలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, కమిషన్ అధికారులు సంధ్యారాణి, హరి, స్రవంతి, రజిత, ఎఫ్‌పీఓలు ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

సంచార జాతులుగా బీసీల్లోని 50 ఉపకులాలు

- ప్రభుత్వానికి బీసీ కమిషన్ నివేదిక

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న సీడ్ పథకానికి అర్హులకు కావాల్సిన డీఎన్‌టీ సర్టిఫికేట్ జారీ విధివిధానాలపై చర్చించింది. తెలంగాణ రాష్ట్రంలో 50 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ, ప్రభుత్వానికి తన సిఫారసుల నివేదికను కమిషన్ ఆమోదించింది. అలాగే ఈ కులాలకు సంబంధించిన సర్టిఫికేట్ జారీలో చేపట్టవలసిన మార్పులు, చేర్పుల గురించి కూడా ప్రభుత్వానికి సిఫారసులను ఆమోదించింది. రాష్ట్రప్రభుత్వం మరియు ప్రభుత్వ సంస్థల్లో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాల్లో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ మినహా మిగతా అన్ని శాఖల నుండి కమిషన్‌కు సమాచారం అందింది. ఈ సమాచారాన్ని క్రోడీకరించి ఉద్యోగరంగంలో బీసీల స్థితిగతులను అంచనా వేయడానికి ఉపయోగించనున్నారు.

ఆదాయానికి మించి ఆస్తులు.. వరంగల్ డిప్యూటీ కలెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

ప్రతిపక్షం ప్రతినిధి, వరంగల్, జనవరి 21: వరంగల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ ఈ సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. గత నెలలో లంచం తీసుకుంటూ వెంకట్ రెడ్డి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ క్రమంలో ఆయన్ను విచారించగా.. భారీగా ఆస్తులను కూడబెట్టినట్లు అధికారులు గుర్తించారు. అందులో భాగంగానే మంచిరేవులలోని ఆయన నివాసంతో పాటు మరికొన్ని చోట్ల ఏసీబీ దాడులు చేపట్టింది. హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఓ ప్రైవేట్ పాఠశాల గుర్తింపు పత్రాల పునరుద్ధరణ కోసం దాదాపు రూ.60,000 లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు వెంకట్ రెడ్డి. అదే సమయంలో ఆయన ఉంటున్న ఇంట్లో సోదాలు జరుపగా పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. అటు.. నల్గొండ జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలోనూ వెంకట్ రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం.. వెంకట్ రెడ్డి ఇంట్లో సోదాలు కొనసాగుతుండగా.. విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతు పనులపై

సాంకేతిక నిపుణుల బృందం ఏర్పాటు

- సీడబ్ల్యుసీ చీఫ్ ఇంజనీర్ డిజైన్స్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో పరిశీలన
- ప్లంజ్ పూల్ నష్టం, మరమ్మతులపై అధ్యయనం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ మరమ్మతు పనులకు కీలక అడుగు పడింది. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతు పనులపై కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ విజ్ఞప్తి మేరకు సెంట్రల్ వాటర్ కమిషన్ ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. శ్రీశైలం ప్రాజెక్ట్ మరమ్మత్తులపై కీలక అడుగు ఈ బృందం త్వరలో శ్రీశైలం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి ప్లంజ్ పూల్ కు జరిగిన నష్టం, మరమ్మతుల అవసరం పైన విస్తృతంగా అధ్యయనం చేస్తుంది. గతంలోనూ దీనిపైన నిపుణుల కమిటీ అధ్యయనం చేసి సిఫార్సులు చేసింది. అయితే ఆ సిఫార్సులు అమలుకు నోచుకోలేదు. గత ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయిన ఈ అంశం పైన మళ్లీ ఇప్పుడు తాజాగా అడుగులు పడుతున్నాయి. "కేంద్రప్రభుత్వం నియమించిన సాంకేతిక నిపుణుల బృందం ఇలా ఈ ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందానికి సీడబ్ల్యుసీ చీఫ్ ఇంజనీర్ డిజైన్స్ వివేక్ త్రిపాఠి నాయకత్వం వహిస్తారు. బృందంలో జలసంఘం నుండి సోమేశ్ కుమార్, సుమంత్, అరుణ్ ప్రతాప్, మధుకాంత్ గోయల్, సెంట్రల్ సాయిల్,మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ నుండి మనీష్ గుప్తా, సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నుండి ఎంకే వర్మ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శైలేంద్రసింగ్, శ్రీశైలం డ్యాం చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌లో దెబ్బ తిన్న ఆప్రాన్ మరియు ప్లంజ్ పూల్ తెలంగాణ నీటిపారుదల శాఖతో పాటు కృష్ణా నది యాజమాన్య బోర్డులు కూడా తమ ప్రతినిధుల వివరాలను తెలపాలని సిడబ్ల్యూసి కోరింది.అయితే శ్రీశైలం డాం దిగువన ఆప్రాన్ మరియు ప్లంజ్ పూల్ తీవ్రంగా దెబ్బతిందని, భద్రతాపరమైన ప్రమాదం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. గతంలో కూడా శ్రీశైలం డ్యామ్ ను ఎన్ డి ఎస్ ఏ చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలోని బృందం పరిశీలించింది. స్పిల్ వేకు ప్రమాదం ఉందని హెచ్చరిక శ్రీశైలం డామ్ ను పరిశీలించి భద్రత పైన ఆందోళన వ్యక్తం చేసింది. ప్లంజ్ పూల్ లోతు 122 మీటర్ల నుండి 160 మీటర్లకు పెరిగిందని, ఆప్రాన్ నుండి 50 నుంచి 250 మీటర్ల వరకు గుంతలు ఏర్పడ్డాయని వారు పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే స్పిల్ వేకు ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇంకా అనేక కీలక సూచనలు కూడా చేశారు. శ్రీశైలం మరమ్మత్తు పనులలో కీలక అడుగు అయితే అవి ఇప్పటివరకు కాగితాలకే పరిమితం కాగా, తాజాగా మరోమారు కేంద్రం దీనిపైన అధ్యయనం కోసం టెక్నికల్ టీం ను ఏర్పాటు చేసింది. ఈ టీం శ్రీశైలం ప్రాజెక్టుకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేస్తుంది. సాంకేతిక సమీక్ష నిర్వహిస్తుంది. మరమ్మతు పనుల కోసం స్పష్టమైన సాంకేతిక మార్గదర్శకాలను అందిస్తుంది. ప్రస్తుతం ఈ టీంను ఏర్పాటు చేసే అధ్యయనం చేయడం ఏళ్ళ కాలంగా పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం మరమత్తు పనులలో ఒక కీలక అడుగుగా చెప్పవచ్చు.

ఆడపడుచులకు చీరతో సారె

- షాద్ నగర్ కాంగ్రెస్ నేత తిరుపతిరెడ్డి
- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 21: తెలంగాణ మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చీర సారెలతో సత్కరిస్తుందని, మహిళల అభ్యున్నతి, వారి గౌరవమే తమకు ప్రధానమని షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలో పెద్ద ఎత్తున మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నందుకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఆయన పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చెంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇందిరా గాంధీ పేరిట పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పాలన బలహీన వర్గాలకు సువర్ణ అధ్యాయమని, ఆమె పరిపాలన ఒక మోడల్ అని కొనియాడారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో 'ప్రజాపాలన' అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారె పెట్టి గౌరవించాలనే ఉద్దేశంతోనే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించారని వెల్లడించారు.

నాగ్ పూర్ లో హెడ్ కోచ్ గంభీర్ ను కలిశా.. నా ఓల్డ్ ఫ్రెండ్ తో మంచి డిస్కషన్ చేశా. దేశంలో పీఎం తర్వాత అత్యంత కష్టమైన ఉద్యోగం గంభీర్ చేస్తున్నారు. రోజు లక్షల మంది విమర్శిస్తున్నా ధైర్యంగా నడుస్తున్నారు. అయనకు అన్ని విజయాలు చేకూరాలని కోరుకుంటున్నా.

- శశి థరూర్, ఎంపీ

ప్రమాదంలో పీఎస్ఎల్వీ విశ్వసనీయత

ఇస్రో ఎంతో విలువైనదిగా భావించే పీఎస్ఎల్వీ రాకెట్ ఇప్పుడు వరుస వైఫల్యాలను ఎదుర్కొంది. ఇస్రో వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ విభాగమైన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) జనవరి 12న పీఎస్ఎల్వీసీ62 ద్వారా మొత్తం 16 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపే ప్రయోగాన్ని నిర్వహించింది. వీటిలో ఈఓఎస్ఎన్1 ఉపగ్రహం కూడా ఉంది.కానీ, రాకెట్ పనితీరులో ఒక లోపం తలెత్తిందని ఇస్రో తెలిపింది. రాకెట్ వెళ్లాల్సిన మార్గం నుంచి పక్కకు తప్పుకుందని వెల్లడించిన ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహిస్తామని చెప్పారు.కిందటేడాది మే నెలలో ఇస్రో ప్రయోగించిన పీఎస్ఎల్వీసీ61 ప్రాజెక్టు కూడా విఫలమైంది. దీంతో పీఎస్ఎల్వీ రాకెట్లకు ఇది వరుసగా రెండో వైఫల్యమని నిపుణులు భావిస్తున్నారు. ఇస్రో ఇప్పటివరకు పీఎస్ఎల్వీ రాకెట్లతో 63 మిషన్లు పూర్తి చేసింది. చంద్రయాన్1, మంగళ్యాన్ (మార్స్ ఆర్బిటర్ మిషన్), సూర్యుడిని పరిశోధించే ఆదిత్య ఎల్1 వంటి కీలక మిషన్లలో ఇస్రో పీఎస్ఎల్వీ రాకెట్లనే ఉపయోగించింది. 2017లో ఒకే మిషన్లో 104 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపి ప్రపంచ రికార్డు సృష్టించింది.ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీసీ61మిషన్ 2025 మే 18న విఫలమైంది. ఇస్రో చరిత్రలో దీన్ని అత్యంత అరుదైన వైఫల్యాల్లో ఒకటిగా పరిగణిస్తారు. దాదాపు 8 నెలల విరామం తర్వాత, ఇప్పుడు (జనవరి 12) పీఎస్ఎల్వీ రాకెట్ మరోసారి గమ్యాన్ని చేరుకోలేకపోయింది.కానీ, ఈ సమస్య ఇక్కడితోనే ముగియదని మొహాలీలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వి. వెంకటేశ్వరన్ అన్నారు.గతంలో ఏదైనా ప్రాజెక్టు విఫలమైతే దానిపై ఇచ్చే 'ఫెయిల్యూర్ అసెస్మెంట్ రిపోర్ట్' చాలా పారదర్శకంగా ఉండేది. పీఎస్ఎల్వీసీ61 ప్రాజెక్టుకు సంబంధించిన ఫెయిల్యూర్ అసెస్మెంట్ రిపోర్టును ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపారు. కానీ, ఇప్పటికీ దాన్ని బహిరంగంగా విడుదల చేయలేదు. ఆ ప్రయోగం ఎందుకు విఫలమైందో అసలు కారణాలు ఇప్పటికీ ప్రజలకు తెలియడం లేదు. 'అంతర్జాతీయ మార్కెట్ ను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో ఇస్రో గర్వంగా భావించే పీఎస్ఎల్వీ రాకెట్ రెండుసార్లు విఫలం కావడం ఇస్రోకు ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే అంతర్జాతీయ మార్కెట్ లో పీఎస్ఎల్వీ రాకెట్ విశ్వసనీయత ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతుంది' అనే అభిప్రాయం బలపడుతోంది. పీఎస్ఎల్వీకి ఇప్పుడు తగిలిన ఎదురుదెబ్బల నుంచి పాఠాలు నేర్చుకొని తర్వాతి ప్రయోగాలను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని వార్తా ఏజెన్సీ ఏఎన్ఐతో శాస్త్రవేత్త సువేందు పట్నాయక్ అన్నారు. 'రైలు బోగీలు ఒకదానితోఒకటి ఎలా అనుసంధానమై ఉంటాయో, అలా పీఎస్ఎల్వీ కూడా 4 రాకెట్ల కలయిక. ప్రయోగించడానికి రాకెట్ సిద్ధంగా ఉన్నప్పుడు, కింద నుంచి పైకి వరుసగా పీఎస్1, పీఎస్2, పీఎస్3, పీఎస్4 అనే నాలుగు విభాగాలు అనుసంధానమై ఉంటాయి. ఇందులో పీఎస్1, పీఎస్3లలో ఘన ఇంధనం ఉంటుంది. మిగతా రెండింటిలో ద్రవరూప ఇంధనం నింపుతారు' అని ఆయన వివరించారు.'పీఎస్1లో ఉండే ఘనరూప ఇంధన రాకెట్, భూమి నుంచి గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పైకి లేవడానికి కావాల్సిన ప్రొపల్షన్ను అందిస్తుంది. ఈ దశలో నిశ్చల స్థితిలో ఉన్న రాకెట్ థ్రస్ట్ను అందుకొని పైకి కదులుతుంది. అయితే ఈ దశలో భూమి నుంచి కొన్ని కిలోమీటర్ల ఎత్తు వరకే రాకెట్ ఎగరగలదు' అని ఆయన వివరించారు పీఎస్ఎల్వీసీ62 ప్రాజెక్టులో రాకెట్ మూడో దశ వరకు అనుకున్న విధంగానే ముందుకు సాగిందని వెంకటేశ్వరన్ చెప్పారు.ఈ దశకు చేరుకున్నాక ఒక పెద్ద సమస్య ఎదురైనట్లు తెలిపారు.ఆవిరి పీడనం తగినంత లేకపోవడమే ఈ సమస్య రావడానికి కారణమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారని పేర్కొన్న వెంకటేశ్వరన్, దీని వెనుక ఉన్న శాస్త్రీయ కారణాన్ని సులభంగా వివరించే ప్రయత్నం చేశారు. ఇస్రోలో తగినంతగా పరీక్షలు చేయకుండానే పంపించారా? ఎవరిది తప్పు? అసలు తప్పు ఎక్కడ జరిగింది? అనేది తెలుసుకోవడం సాధ్యమవుతుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
22.01.2026

అందమైన ద్వీపం అమెరికా స్వంతమా?

ట్రంప్ లాంటి వ్యక్తిని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అమెరికా పౌరులే కాదు, స్వయంగా రిపబ్లికన్ పార్టీ సభ్యులే పశ్చాత్తాప పడుతున్నారు. అమెరికా గ్రీన్ లాండ్ పై సైనిక చర్యకు పాల్పడి, ఆక్రమించుకుంటే ప్రపంచ పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించలేం. నోబెల్ శాంతి బహుమతి దక్కలేదనే అక్కసుతో రగిలి పోతున్న ట్రంప్ ఇక మీదట శాంతి ప్రయత్నాలు చేయబోనని పేర్కొనడం హాస్యాస్పదం. అడుగడుగునా సామ్రాజ్యవాదం, దురహంకారం వంటి మానసిక ఉన్మాదంతో ఊగిపోతున్న ట్రంప్ శాంతి దూత కాదు,యుద్ధోన్మాది మాత్రమే.

సుంకవల్లి సత్తిరాజు
9704903463

ఇతర దేశాలను కొనుగోలు చేయడం, వీలుకాకుంటే ఆక్రమించుకోవడం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య.అమెరికా గత చరిత్రను పరిశీలిస్తే ఈ వాస్తవం అవగతమవుతుంది. 50రాష్ట్రాల అమెరికాలో అలాస్కా రాష్ట్రం అతి పెద్దది. అలాస్కా ను 1867లో రష్యా నుండి అమెరికా కొనుగోలు చేసింది.అమెరికాలో అత్యధిక జనాభా గల రాష్ట్రమైన కాలిఫోర్నియాను గతంలో మెక్సికో పై దాడి చేసి అమెరికా వశపరచుకుంది. నెవాడా, ఉటా, అరిజోనా, మరియు న్యూ మెక్సికో వంటి రాష్ట్రాల భూభాగాలు కూడా మెక్సికో నుంచి అమెరికాకు బదిలీ చేయబడ్డాయి. ఇంతే కాకుండా ఫ్రాన్స్ నుంచి లూసియానా,స్పెయిన్ నుంచి ఫ్లోరిడా ను అప్పట్లో అమెరికా మిలియన్ల డాలర్లను వెచ్చించి,కొనుగోలు విషయం విదితమే. తన సార్వభౌమత్వానికి,భద్రతకు సవాలుగా భావించే భూభాగాలను అమెరికా కొనడమో,సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకోవడమో ఇప్పటి వరకు జరిగిన తతంతం.19 వ శతాబ్దంలో కొనసాగించిన రాజ్య విస్తరణ కార్యక్రమాన్ని 21 వ శతాబ్దంలో కూడా కొనసాగించాలని అమెరికా ఉవ్విళ్లూరుతున్నది. గ్రీన్ లాండ్ ను ఆక్రమించాలన్న అమెరికా ఆకాంక్ష ఇందులో భాగమే. డెన్మార్క్ ఒక సార్వభౌమత్వ దేశం.నార్వే,స్వీడన్ దేశాలతో పాటు డెన్మార్క్ కూడా స్కాండినేవియన్ దేశంగానే పరిగణించబడుతున్నది. డెన్మార్క్ రాజ్యం స్వీడన్ జర్మనీ తో భూ సరిహద్దును ,స్వీడన్,నార్వే దేశాలతో సముద్ర సరిహద్దులను కలిగి ఉంది. డెన్మార్క్ లో అనేక ద్వీపాలున్నాయి. ఇందులో 'గ్రీన్ లాండ్' ప్రపంచంలో అతి పెద్ద ద్వీపం. ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలోని గ్రీన్ లాండ్ ప్రస్తుతం చర్చనీయాంశం గా మారింది. గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకోవాలనే డోనాల్డ్ ట్రంప్ అనుచిత నిర్ణయమే ఇందుకు కారణం. ప్రపంచంలో అతి తక్కువ జనసాంద్రత గల గ్రీన్ లాండ్ జనాభా సుమారు 57 వేల వరకు ఉండవచ్చని అంచనా. ఆర్కిటిక్,ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రాల మధ్య ప్రపంచంలో అతి పెద్ద ద్వీపంగా గ్రీన్ లాండ్ మనుగడ సాగిస్తున్నది.గ్రీన్ లాండ్ లో అధిక భాగం ఆర్కిటిక్ ప్రాంతంలో ఉంది. ఇది ఉత్తర అమెరికాలో భాగం.డెన్మార్ ఉత్తర యూరప్ లో ఉంది. ఉత్తర అమెరికాలోని గ్రీన్ లాండ్ ఉత్తర ఐరోపాలో గల డెన్మార్క్ దేశం లో ఒక స్వతంత్ర స్వయం ప్రతిపత్తి గల ద్వీపంగా కొనసాగుతున్నది. 1953 వ సంవత్సరంలో గ్రీన్ లాండ్ డెన్మార్క్ లో విలీన చేయబడి, 1979 లో స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంగా స్వీయ పాలన చేసుకుంటున్నది. గ్రీన్ లాండ్ రక్షణ బాధ్యత డెన్మార్క్ దే. ఇందులో ఇతర దేశాలకు ఎలాంటి ప్రమేయం లేదు. 400 లకు పైగా ద్వీపాలు గల డెన్మార్క్ లో గ్రీన్ లాండ్ కు ప్రత్యేక స్థానముంది. గ్రీన్ లాండ్ భూ సరిహద్దులు లేని ద్వీపం. ఈ ద్వీపం కెనడా, ఐస్ లాండ్, నార్వే లతో సముద్ర సరిహద్దులను కలిగి ఉంది.రంగు రంగుల రమణీయ ప్రకృతి దృశ్యాలతో అలరించే గ్రీన్ లాండ్ ఒక అద్భుతమైన ద్వీపం. ఇక్కడ వేసవి కాలంలో రాత్రి ఉండదు. 24గంటలూ పగలే. ఆర్కిటిక్ వలయంలో ఎనిమిది దేశాల భూభాగాలున్నాయి. ఆర్కిటిక్ వలయంలో అతి పెద్ద దేశం రష్యా. గ్రీన్ లాండ్, ఫిన్లాండ్,ఐస్లాండ్,నార్వే రష్యా స్వీడన్, అమెరికాలోని అలాస్కా,డెన్మార్క్ లోని గ్రీన్ లాండ్ లు ఆర్కిటిక్ వలయంలో భూభాగాలను కలిగి ఉన్నాయి. రష్యా ఆర్కిటిక్ వలయానికి దగ్గర్లో ఉన్న దేశం. అమెరికాతో పాటు ఇక్కడ రష్యా కు కూడా సైనిక స్థావరాలున్నాయి. 32సభ్య దేశాలు గల నాటోకు, 27దేశాల యూరోపియన్ యూనియన్ కు "గ్రీన్ లాండ్" ఒక వ్యూహాత్మక ప్రాంతం. గ్రీన్ లాండ్ గగన తలం,ఆర్కిటిక్ సర్కిల్ అమెరికా భవిష్య భద్రతకు అవసరం.గ్రీన్ లాండ్ లోని ఖనిజ సంపద,ఇతర సహజ వనరుల దృష్ట్యా గ్రీన్లాండ్ పై అమెరికా కన్నుపడింది. గ్రీన్ లాండ్ ను ఆక్రమించుకోవాలనే దుర్బుద్ధి కలిగింది. అమెరికాకు నాటో దేశాలు ప్రస్తుతం మిత్ర దేశాలుగా కొనసాగుతున్నప్పటికీ భవిష్యత్తులో గ్రీన్ లాండ్ జలాల్లో నాటో విన్యాసాలు జరపకుండా కేవలం తమ భద్రత దృష్ట్యా గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకోవడమే అమెరికా ధ్యేయంగా కనబడుతున్నది.డెన్మార్క్ దేశం నాటో మరియు ఈయూ లో సభ్యత్వ దేశంగా కొనసాగుతున్నందున డెన్మార్క్ లో అంతర్భాగమైన గ్రీన్ లాండ్ ను కూడా సహజంగా నాటో మరియు యూరోపియన్ దేశాల్లోను భాగస్వామిగానే పరిగణించవలసి ఉంటుంది. డెన్మార్క్ నియంత్రణ లోని గ్రీన్ లాండ్ తన దేశ భద్రతకు అత్యంత అవసరమని, గ్రీన్ లాండ్ ను అమ్మకానికి పెట్టాలని లేకపోతే సైనిక చర్య ద్వారా తాము గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం హాస్యాస్పదమైనా, ఇది అత్యంత ఆందోళన కలిగించే అంశంగా మారింది.ఒకవైపు రష్యా వలన గ్రీన్ లాండ్ కు ముప్పు పొంచి ఉందంటూనే, మరోవైపు గ్రీన్ లాండ్ ను ఆక్రమించుకుంటామని ట్రంప్ హెచ్చరించడం అమెరికా ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతున్నది. ఇతర దేశాల భూభాగాలపై బరితెగించి విరుచుకు పడడం అమెరికా తెంపరి తనాన్ని,సామ్రాజ్యవాద విస్తరణ వైఖరిని చాటి చెబుతున్నది. గ్రీన్ లాండ్ స్వాధీనానికి సహకరించని దేశాలపై 10శాతం సుంకాలను విధించడం పట్ల ఈయూ దేశాలు తీవ్రంగా గర్హిస్తున్నాయి. అమెరికా చర్య పట్ల బ్రిటన్,ఫ్రాన్స్ ప్రధానులు బాహాటంగానే ట్రంప్ ను విమర్శించడం జరిగింది. ఇప్పటికే స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ లు తమ బలగాలను గ్రీన్ లాండ్ రక్షణ కోసం అక్కడికి తరలించాయి. తన మిత్ర దేశాలపైనే ట్రంప్ మండిపడడం ప్రతీకార సుంకాలు విధించడం ఆశ్చర్యకరం. ట్రంప్ తో చెలిమి నిప్పుతో చెలగాటమన్న నిజాన్ని నాటో దేశాలు గుర్తించాయి. అమెరికా లేకపోతే నాటో లేదని ట్రంప్ ఇదివరకే స్పష్టం చేసారు. నాటో లేకుండా చేయడమే ట్రంప్ ధ్యేయంలా కనిపిస్తున్నది. ట్రంప్ పోకడలు రష్యా, చైనా లకు లబ్ధి చేకూర్చగలవు. నాటో విచ్ఛిన్నత వలన రష్యా మరింత ఉత్సాహంతో ఉక్రెయిన్ పై విరుచుకుపడి స్వాధీనం చేసుకునే అవకాశాలను తోసిపుచ్చలేం. ట్రంప్ లాంటి వ్యక్తిని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అమెరికా పౌరులే కాదు, స్వయంగా రిపబ్లికన్ పార్టీ సభ్యులే పశ్చాత్తాప పడుతున్నారు. అమెరికా గ్రీన్ లాండ్ పై సైనిక చర్యకు పాల్పడి, ఆక్రమించుకుంటే ప్రపంచ పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించలేం. నోబెల్ శాంతి బహుమతి దక్కలేదనే అక్కసుతో రగిలి పోతున్న ట్రంప్ ఇక మీదట శాంతి ప్రయత్నాలు చేయబోనని పేర్కొనడం హాస్యాస్పదం. అడుగడుగునా సామ్రాజ్యవాదం, దురహంకారం వంటి మానసిక ఉన్మాదంతో ఊగిపోతున్న ట్రంప్ శాంతి దూత కాదు,యుద్ధోన్మాది మాత్రమే.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)

ప్రభుత్వ బడులలో బోధనకు సంకెళ్లు

పల్లె నాగరాజు
8500431793

ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం, ఉపాధ్యాయులను ఆధునిక బోధనా పద్ధతులకు అనుగుణంగా తీర్చిదిద్దడం ఏ ప్రభుత్వానికైనా మొదటి ప్రాధాన్యత కావాలి. అయితే తెలంగాణ విద్యాశాఖ ఇటీవలి కాలంలో ఉపాధ్యాయులకు చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలు చూస్తుంటే..అసలు లక్ష్యం పక్కుకుపోయి 'శిక్షణే లక్ష్యం' సాగుతున్నట్లు కనిపిస్తుంది. ఏడాది పొడవున ఎదో ఒక శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను తరగతి గదులకు దూరం చెయ్యడం ఆశాస్త్రీయం. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుండి సుమారు 22రోజులు పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అంటే విద్యార్థులు అత్యంత కీలకమైన బోధనా సమయాన్ని కోల్పోవడమే అవుతుంది. ఇది డిసెంబర్ నెలవరకే. ఇంకా విద్యా సంవత్సరం పూర్తయ్యే లోపుల ఇంకా ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారో అనే ప్రశ్నలు ఉపాధ్యాయులనుండి వ్యక్తమవుతున్నాయి.

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే 'మే' నెలలో ఉపాధ్యాయులకు విద్యా శాఖ శిక్షణ ఇచ్చింది. మొదటి విడతగా మే 13 నుండి 17 వరకు ఐదు రోజుల పాటు 17 వేలకు పైగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. రెండో విడతలో మే 20నుండి 24వరకు ఐదు రోజులపాటు 89 వేలకు పైగా టీచర్లకు విద్యా శాఖ శిక్షణ ఇచ్చింది మొత్తంగా 1.22 లక్షల మంది టీచర్లకు శిక్షణ ఇచ్చింది. బోధన సమయం వృధా కాకుండా టీచర్లకు వేసవి సెలవుల్లోనే శిక్షణ ఇస్తున్నాం. ఆ తర్వాత ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉండవని విద్యాశాఖ ఉన్నత అధికారులు పలుమార్లు ప్రకటించి విద్యా సంవత్సరం ప్రారంభం అయిన తర్వాత కూడ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యడం విద్యాశాఖ అధికారుల ప్రణాళిక రహిత్యాన్ని సూచిస్తుంది. బడులు ప్రారంభమైన తర్వాత కూడ పాఠశాల గ్రంథాలయాలు, రీడింగ్ కార్నర్స్ బలోపేతం పేరిట జులై 23న జిల్లా స్థాయిలో ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ కీ ఇద్దరు టీచర్లను ఎంపికచేసి శిక్షణ ఇచ్చారు. ఇది ముగిసిన తర్వాత జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ కు ఆగస్టు 4నుండి 7వరకు కెపాసిటి బిల్డింగ్ ప్రోగ్రాం పేరిట శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత ఖాన్ అకాడమీ ఒప్పందంలో భాగంగా అక్టోబర్ 14,15 తేదీలలో ప్రధానోపాధ్యాయులకు ఆన్లైన్ ఒరియాంటేషన్ నిర్వహించారు. అక్టోబర్ 27నుండి 30వరకు గణితం, సైన్స్ టీచర్లకు ఫిజిక్స్ వాలా ఎన్జీవోలో భాగంగా శిక్షణ ఇచ్చారు.వీటితో పాటు కాంప్లెక్స్ సమావేశాలకు కూడ ఉపాధ్యాయులు కూడ హాజరు కావాల్సి ఉంటుంది. ఈవిధంగా విద్యా సంవత్సరం పొడుగునా ఉపాధ్యాయులను శిక్షణ తరగతుల పేరిట పాఠశాలలకు దూరం చెయ్యడం వలన సిలబస్ సకాలంలో పూర్తికాక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెలంగాణలో 5వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. అటువంటి పాఠశాలలో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు శిక్షణకీ వెళ్ళితే ఆరోజు పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనితో పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యసన సామర్థ్యం దెబ్బతింటుంది. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టడం విద్యా హక్కు చట్టం మూల ఉద్దేశానికి విరుద్ధం. ప్రభుత్వరంగంలో నిపుణులైన రిసోర్స్ పర్సన్స్ ఉన్నపటికీ,ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ప్రైవేట్ సంస్థలకు శిక్షణ బాధ్యతలు అప్పగించడంపై ఉపాధ్యాయ వర్గాలలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ప్రైవేట్ సంస్థల జోక్యాన్ని పెంచడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయుల అనుభవాన్ని తక్కువ చేయడమే అవుతుంది. శిక్షణల పేరిట కార్పొరేట్ సంస్థల ముద్రను ప్రభుత్వ పాఠశాలలపై వేయడం ఎంత వరకు సమంజసం? అని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.అంటే విద్యాశాఖ అధికారులకు విద్యార్థుల భవిష్యత్తు కంటే ప్రయివేట్ సంస్థలతో ఒప్పందమే ముఖ్యమని స్పష్టంగా అర్థమవుతుంది.విద్యాశాఖను ముఖ్యమంత్రినే స్వయంగా చూస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే నా ప్రధాన లక్ష్యం ఒక వైపు ప్రకటిస్తుంటే,మరో పక్క విద్యాశాఖ అధికారులు బోధనకు ఆటంకంతో పాటు ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ప్రమాదం వచ్చే నిర్ణయాలు తీసుకోవడం చూస్తుంటే ముఖ్యమంత్రికీ తెలియకుండానే అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారా?అని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపయోగ పడాలేకాని బోధనకు సంకెళ్లు వేసి విద్యార్థులకీ నష్టం చేకూర్చే విధంగా ఉండకూడదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండే వాస్తవాలను పరిగణలోకి తీసుకోని ప్రయివేట్ సంస్థల ఒప్పందాలను పునరాలోచించి,సరైన ప్రణాళిక లేని శిక్షణ కార్యక్రమాల నుండి ఉపాధ్యాయులను విముక్తి చేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా సాధ్యమవుతుంది.

- వ్యాస రచయిత తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్), ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి

మేడారానికి 'జాతీయ హోదా' ఏది?

వెంక గారి భూమయ్య
9848559863

భారతదేశ సాంస్కృతిక ముఖచిత్రంలో మేడారం సమ్మక్కసారలమ్మ జాతర ఒక అపురూపమైన ఘట్టం. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన మేళాగా, దక్షిణ భారత కుంభమేళాగా పిలవబడే ఈ మహా జాతర అక్షరాలా కోట్లాది మంది ఆదివాసీల ఉనికికి, అచంచల విశ్వాసానికి ప్రతీక. అయితే, దశాబ్దాలుగా వినిపిస్తున్న 'మేడారంకు జాతీయ హోదా' డిమాండ్ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి ఇప్పుడు కోట్లాది మంది భక్తుల ఆగ్రహానికి కారణమవుతోంది.

నాలుగు కోట్ల మంది విశ్వాసం.. మరి గుర్తింపు ఏది?

గణాంకాలను ఒకసారి పరిశీలిస్తే మేడారం వైశిష్ట్యం ఇట్టే అర్థమవుతుంది. కేవలం తెలంగాణ నుంచే కాకుండా ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్ణాటక వంటి సుమారు 10 రాష్ట్రాల నుండి అక్షరాలా నాలుగు కోట్ల మందికి పైగా భక్తులు మేడారం గద్దపై అడుగు పెడతారు. వీరంతా ఎవరి ఒత్తిడితోనో రావడం లేదు; కేవలం ఆ తల్లుల మీద ఉన్న అపారమైన విశ్వాసంతో, అడవి బిడ్డల ఆత్మగౌరవంపై ఉన్న నమ్మకంతో తరలివస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట ఇంత భారీ సంఖ్యలో గిరిజనులు ఏకమయ్యే ఏకైక సందర్భం ఇది. ఇంతటి జన సందోహం, అంతర్రాష్ట్ర ప్రాముఖ్యత కలిగిన ఉత్సవానికి 'జాతీయ హోదా' ఇవ్వడానికి కేంద్రానికి అభ్యంతరం ఏమిటి?

పాలకుల పరధ్యానం..
మేడారం గద్దపై అడుగుపెట్టని 'పెద్దలు'

కేంద్ర పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట ఏమిటంటే.. ఇంతటి మహా జాతరను దేశ ప్రధాని కానీ, కేంద్ర హోం మంత్రి కానీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా సందర్శించకపోవడం. ప్రయాగ కుంభమేళా జరిగితే ప్రధానమంత్రి స్వయంగా వెళ్లి పవిత్ర స్నానాలు ఆచరించి, ఆ ఉత్సవానికి జాతీయ ప్రాధాన్యతను కల్పిస్తారు. మరి అక్షరాలా నాలుగు కోట్ల మంది భక్తులు వచ్చే మేడారం గద్దపై అడుగుపెట్టడానికి ఈ 'పెద్దలకు' సమయం దొరకలేదా? లేక ఆదివాసీల విశ్వాసం వారి దృష్టిలో అంత చులకనా?

కుంభమేళాకు వేల కోట్లు.. మేడారానికి మొండిచేయి!

ప్రయాగలో కుంభమేళా జరిగితే కేంద్రం అడిగినా అడగకపోయినా వేల కోట్ల రూపాయలను ధారపోస్తుంది. గడిచిన కుంభమేళాకు కేంద్ర ప్రభుత్వం సుమారు 4,200 కోట్ల రూపాయలను వెచ్చించిన కేంద్రం.. నాలుగు కోట్ల మంది ప్రాతినిధ్యం ఉన్న మేడారానికి ఇచ్చే నిధులు సముద్రంలో కాకిరెక్కలా ఉంటున్నాయి. ఇది అక్షరాలా గిరిజన సంస్కృతిపై కేంద్రానికి ఉన్న 'చిన్నచూపు'కు పరాకాష్ట.

రాజ్యాంగబద్ధమైన హక్కు.. వివక్షాపూరిత వైఖరి

సమ్మక్కసారలమ్మల పోరాట చరిత్ర సామాన్యమైనది కాదు. అది అన్యాయమైన పన్నులకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద అహంకారంపై సామాన్య గిరిజన మహిళలు చేసిన వీరోచిత యుద్ధం. భారతదేశ మూలవాసులైన ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక ఈ జాతర. భారతదేశ చరిత్ర అంటే కేవలం పాలకుల చరిత్రేనా? ప్రజల కోసం పోరాడిన ఆదివాసీల గాథలు కేంద్ర ప్రభుత్వ రికార్డుల్లోకి ఎందుకు ఎక్కడం లేదు? రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా వందల కోట్లు ఖర్చు చేస్తూ మౌలిక వసతులు కల్పిస్తున్నా, కేంద్రం మాత్రం 'టెక్నికల్' కారణాలు చెప్తూ జాతీయ హోదా ఫైళ్లను పక్కన పెడుతోంది.

జాతీయ హోదా సాధించాల్సిందే!

జాతీయ హోదా అంటే కేవలం మరిన్ని నిధులు రావడం మాత్రమే కాదు, అది ఆదివాసీ సంస్కృతికి దక్కే జాతీయ గౌరవం. నాలుగు కోట్ల మంది అచంచల విశ్వాసంతో ముడిపడి ఉన్న ఈ జాతరను జాతీయ ఉత్సవంగా ప్రకటించకపోవడం అంటే తెలంగాణను, ఇక్కడి ఆదివాసీలను కేంద్రం విస్మరించడమే. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేడారం వైపు తన దృష్టిని సారించాలి. మేడారం జాతరకు తక్షణమే జాతీయ హోదాను ప్రకటించి, కుంభమేళాతో సమానంగా నిధులు కేటాయించాలి.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

మహిళా సాధికారతకు తోడ్పాటును అందిస్తాం

- గ్రేటర్లో లక్ష స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు కృషి
- హెచ్ సిటీ, ఎస్ఆర్డీపీ ప్రాజెక్ట్ లను త్వరితగతిన పూర్తి చేయాలి
- సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పైనే హైదరాబాద్ స్వచ్ఛ బ్రాండ్ ఇమేజ్
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 21 : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే క్రమంలో హైదరాబాద్ మహానగరంలో మహిళా సాధికారతకు మరింత తోడ్పాటును అందిస్తామని జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జీహెచ్ఎంసీ విస్తరించి బృహత్ నగరంగా ఆవిర్భవించడం, మరో 20 రోజుల్లో పాలకవర్గ కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ లు, జోనల్ కమిషనర్ లు, డిప్యూటీ కమిషనర్ లు , విభాగాల ఉన్నతాధికారులతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి పై సమీక్షించారు. హెచ్ సిటీ, ఎస్ఆర్డీపీ, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, రోడ్లు-స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, సానిటేషన్, ప్రజారోగ్యం, ఐటీ, టౌన్ ప్లానింగ్, మహిళా సంక్షేమం, పట్టణ స్వయం సహాయక సంఘాలకు చేయూత, పర్యావరణం , గాలి నాణ్యత వంటి అంశాలను వాటి పురోగతిని, క్షేత్ర సమస్యలు, ప్రభుత్వ సహకారాన్ని పేర్కొంటూ సంబంధిత అధికారులు మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పాలకవర్గం పదవి కాలం మరో 20 రోజుల్లో ముగియనుండడంతో జీహెచ్ఎంసీ అధికారులపై మరింత బాధ్యత పెరగనుందని మంత్రి అన్నారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని పనులను త్వరితగిన పూర్తి చేయాలన్నారు. ప్లాన్ ఆఫ్‌యాక్షన్ సిద్ధం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అధికారులు సూచించారు. మహిళా ఆర్థిక సాధికారిత, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రేటర్ లో 72, 942 పైగా ఉన్న స్వయం సహాయక సంఘాలను లక్ష సంఘాల కు పైగా పెంచాలన్నారు. 15 లక్షల మందిని సభ్యులుగా చేర్చాలన్నారు. బీపీఎల్ కుటుంబానికి చెందిన ప్రతి మహిళా సంఘంలో సభ్యులుగా చేర్చాలన్నారు. సెట్విన్ సహకారంతో నగరంలోని మహిళా సంఘాలకు వివిధ జీవనోపాధుల పై తర్ఫీదు నుంచి తమ కాళ్లపై తాము నిలబడేలా ఉపాధి కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా ప్రయత్నించి సక్సెస్ అయ్యామని, అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ లో 40 నుంచి 50 బస్సులు స్వయం సహాయక సంఘాలకు ఇస్తామని తెలిపారు. హెచ్ సిటీ , ఎస్ఆర్‌డీపీ, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు పకడ్బంది కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. హైదరాబాద్ లో కాలుష్య నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రాధాన్యత నివ్వాలని మంత్రి అధికారులు సూచించారు. వాయు నాణ్యతను కాపాడు కాపాడడంలో జిహెచ్ఎంసి ప్రధాన బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో భూగర్భ జలాలను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సామ దాన దండోపాయలను ఉపయోగించి ఇంటి నిర్మాణ సమయంలోనే ఇంకుడు గుంతలను తప్పనిసరిగా నిర్మించుకునేలా చూడాలన్నారు. నగరంలో విద్యుద్దీపాల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పూర్తి స్థాయిలో వెలిగేలా చూడాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ పైనే హైదరాబాద్ స్వచ్ఛ బ్రాండ్ ఇమేజ్ ఆధారపడి ఉందని చెప్పారు. స్వచ్ఛత కార్యక్రమాలు క్రమం తప్పకుండా ప్రభావంతంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. బస్తీ దవాఖాన, ఇందిరమ్మ క్యాంటీన్ లు సజావుగా నిర్వహించేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ 5 ఏండ్ల తమ పాలకవర్గ పాలనలో సహకరించిన ప్రభుత్వం , ప్రజా ప్రతినిధులు, అధికారులు, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీజీ ఆర్టీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా మెరుగుపరిచేందుకు ఎంఎంటీఎస్ స్టేషన్ , మెట్రో స్టేషన్ లకు బస్ కనెక్టివిటీ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ లో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత ప్రభావంతంగా జరిగేందుకు పర్యవేక్షణ బాధ్యతలను మెడికల్ అధికారుల నుంచి ఇంజనీర్లకు అప్పగించమన్నారు. హెచ్ సిటీ, ఎస్ ఆర్‌డీపీ, డీ సిల్టింగ్ పనులను టైమ్ బౌండ్ తో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, అదనపు కమిషనర్లు సృజన, వినయ్ కృష్ణారెడ్డి, అనురాగ్ జయంతి ,హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

22 మందికి కారుణ్య నియామక పత్రాలు

సమావేశం అనంతరం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో మంత్రి, మేయర్ లు 22 మందికి ఆఫీస్ సబార్డినేట్లు, జూనియర్ అసిస్టెంట్ లుగా కారుణ్య నియామక పత్రాలు అందించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించి జిహెచ్ఎంసికి మంచి పేరు తీసుకురావాలని ఉద్యోగులకు సూచించారు.

కటోరా హౌజ్ పునరుద్ధరణకు పూర్తి సహకారం

- పరిశీలించిన హైడ్రా కమిషనర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: గోల్కొండ కోట ప్రాంగణంలో చారిత్రక కటోరా హౌజ్ పరిరక్షణకు హైడ్రా పూర్తి సహకారం అందిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ నీటి వనరును కాపాడేందుకు నిర్మాణ్ ఎన్‌జీవో ముందుకు రావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కేంద్ర ఆర్కియాలజీ శాఖ సంరక్షణలో ఉన్న ఈ చెరువును హైడ్రా కమిషనర్ బుధవారం సందర్శించారు. కటోరా హౌజ్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు సహకరించాలని కోరిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఈ నీటి వనరును కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను హైడ్రా కమిషనర్‌కు నిర్మాణ్ ఎన్‌జీవో తరఫున పనులు పర్యవేక్షిస్తున్న కల్పనా రమేష్, ఆర్కియాలజీ విభాగం అధికారులు తెలిపారు. నీటి ట్యాంక్‌లో చెత్త వేయడానికి వీలు లేకుండా ఎత్తయిన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు.. చుట్టూ పాత్‌వే అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. ఈ చారిత్రక నీటి వనరులోంచే వేసిన మురుగునీటి పైపు లైనుకు ప్రత్యామ్నాయం చూపేందుకు సహకరించాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు. ఇక్కడ అభివృద్ధి పనులకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయని.. హైడ్రా సహకారం ఉంటే కటోరా హౌజ్‌కు పూర్వ వైభవం తీసుకురావడం సాధ్యమౌతుందన్నారు. చారిత్రక చెరువులను కాపాడడంలో హైడ్రాకు ఉన్న అనుభవం కటోరాహౌజ్ అభివృద్ధికి దోహదపడాలని అభ్యర్థించారు. జలాశయం పునరుద్ధరణకు హైడ్రా పూర్తిస్థాయిలో సహకరిస్తుందని, అలాగే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు. చారిత్రక జలవనరుల సంరక్షణ అత్యంత అవసరమని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీని అభివృద్ధికి సంబంధించి చేపట్టిన కార్యక్రమాలను నివేదించాలని నిర్మాణ్ ఎన్‌జీవో, ఆర్కియాలజీ విభాగం అధికారులను కమిషనర్ కోరారు.

రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణ భేష్

- చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించిన రాజస్థాన్ బృందం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 21: కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును రాజస్థాన్ అధికారుల బృందం పరిశీలించి ప్రశంసించింది. రామడుగు మండలం వెలిచాల గ్రామంలో ఈ బృందం అధికారులు సందర్శించి అక్కడ చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను సేకరించడం, గ్రామస్తులు తడి పొడి చెత్తను వేరువేరుగా ఉంచి పారిశుద్ధ్య వాహనానికి అందించడం, సేకరించిన చెత్తతో ఎరువుల తయారీ విధానం తదితర అంశాలను ఈ బృందం అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను గురించి బృందం సభ్యులకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో మల్టీపర్పస్ వర్కర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తున్న రక్షణ కవచాలు, బీమా సౌకర్యం తదితర విషయాలను గురించి సభ్యులతో చర్చించారు. రాజస్థాన్ బృందం సభ్యుల్లో స్వచ్ఛభారత్ మిషన్ రాజస్థాన్ డైరెక్టర్ సాలోని కెంకా, గంగానగర్ జెడ్పీ సీఈవో గిరిధర్, బర్మార్ జెడ్పి సీఈవో రవికుమార్, ఎస్ బి ఎం బ్యాంక్ డైరెక్టర్ మురళి లాల్ శర్మ, ఈఈ రాజేష్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీధర్, రూరల్ వాటర్ సప్లై, పంచాయతీరాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులు, తొలితరం ప్రజా వాగ్గేయకారులు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ 93వ జయంతి వేడుకలు బుధవారం సాయంత్రం రవీంద్ర భారతీలో జరిగాయి. ఈ వేడుకల్లో ఐజేయూ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, మాడభూషణ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం, హైదరాబాద్

ఓటర్ జాబితాల అందుబాటులో

పారదర్శకత-గోప్యతకు సమతుల్యత అవసరం

- ఐఐడీఈఎం–2026లో తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 21 : ఓటర్ల జాబితా (వోటర్ రిజిస్టర్) ప్రజలకు సులభంగా, భద్రంగా అందుబాటులో ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, ప్రజాభిమానం, విశ్వాసానికి మూలస్తంభమని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఇండియా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ అంశంపై జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు, పౌరసమాజ సంస్థలు తమ వ్యక్తిగత వివరాల పరిశీలన, ఎన్నికల ప్రణాళికలు, ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ కోసం ఖచ్చితమైన ఓటర్ డేటాపై ఆధారపడుతున్నాయని తెలిపారు. అయితే సమాచార అందుబాటుతో పాటు వ్యక్తిగత గోప్యత, డేటా భద్రతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ఓటర్ లుక్‌అప్ సేవలు, నియంత్రిత ప్రవేశ కియోస్కులు, పరిమిత వివరాలతో ఓటర్ జాబితాల ప్రచురణ వంటి విధానాలు భద్రతతో కూడిన, ప్రజలకు అనుకూలమైన మార్గాలుగా పని చేస్తున్నాయని వివరించారు.సాంకేతికత ఆధారిత సేవల ద్వారా ఓటర్ సేవల్లో మెరుగుదల, ఫిర్యాదుల తగ్గింపు, ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకం పెరగడం సాధ్యమైందని తెలిపారు. సమతుల్యమైన అందుబాటు వ్యవస్థలు ప్రజాస్వామ్య ప్రమాణాలకు అనుగుణంగా పారదర్శకతను పెంచడంతో పాటు పౌరుల సార్థక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ సదస్సును సి. సుదర్శన్ రెడ్డి స్వయంగా మోడరేట్ చేయగా, సురినామ్, మెక్సికో దేశాల ఎన్నికల ప్రతినిధులు, హైదరాబాద్‌కు చెందిన విద్యావేత్తలు, భారత ఎన్నికల సంఘం ప్రతినిధులు ప్రసంగించారు. అనంతరం చర్చలు, ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగింది.70కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్న ఐఐసీడీఈఎం-2026 సదస్సు, ఎన్నికల నిర్వహణలో అంతర్జాతీయ ఉత్తమ విధానాలు, ఆవిష్కరణలు, సవాళ్లపై గ్లోబల్ స్థాయి చర్చలకు వేదికగా నిలుస్తోంది.

తల్లుల సన్నిధిలో పులకింత

మొదటిపేజీ తరువాయి

పూలు, పండ్లు కొబ్బరికాయలు బెల్లం తల్లుల గద్దెలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పార్కింగ్‌లకు మళ్ళిన వాహనాలు..మేడారం వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వందల వాహనాల్లో పెద్దసంఖ్యలో భక్తులు మంగళవారం తరలివచ్చారు. వాహనాలు అధికంగా వస్తుండడంతో వాటిని పోలీసులు పార్కింగ్ స్థలాలకు వాహనాలను మళ్ళించారు. జాతరలో భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్‌శాఖ అధ్వర్యంలో రెండు వేలకు పైగా బారికేడ్లను మేడారం తరలించారు. వీటిని జాతరలో రోడ్ల మళ్లింపు, వాహనాలను పార్కింగ్‌లకు పంపించే విధంగా ఉపయోగించనున్నారు.

మహా జాతరకు భారీ ఏర్పాట్లు

సమ్మక్క, సారలమ్మ జాతర ప్రారంభానికి మరో వారం రోజులు మాత్రమే ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జనవరి 28 నుండి 31 వరకు నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు దాదాపు కోటిన్నర కు పైగా మంది భక్తులు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేసింది. మేడారం చరిత్రలో గతంలో మరెన్నడూ లేని విధంగా 2026 జాతరకు రూ. 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేటాయించారు. మరో వందేళ్ల వరకు నిలిచిపోయేలా సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణ అభివృద్ధికే రూ. 100 కోట్లను కేటాయించి రికార్డు సమయంలో పనులను పూర్తి చేశారు. ఈనెల 19 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం ఈ అభివృద్ధి పనులను జాతికి అంకితం చేశారు. మేడారం జాతర ప్రదేశాన్ని మొత్తం 8 ప్రధాన పరిపాలనా జోన్ లుగా విభజించారు. ఈజోన్ ఒక్కొక్కటికి ఒక జిల్లా స్థాయి అధికారిని జోనల్ అధికారిగా, సీనియర్ అసిస్టెంట్ అధికారిని అసిస్టెంట్ జోనల్ అధికారిగా నియమించారు. 42 సెక్టార్లుగా ఏర్పాటుచేసి ఒక్కో సెక్టార్ కు మండల స్థాయి అధికారిని ఇంఛార్జిగా నియమించారు. వీటిలో ముఖ్యంగా, టెంపుల్ చిలకలగట్టు ప్రాంతాన్ని జోన్ 1 గా పెట్టి దీనిలో మాస్టర్ కంట్రోల్ రూమ్,మేడారం ప్రోటోకాల్ ఆఫీస్, టెంపుల్ ఎంట్రీ పాయింట్స్, టెంపుల్ ఎగ్జిట్ పాయింట్లు, గద్దెల వద్ద తప్పిపోయిన వారి క్యాంపు, మీడియా సెంటర్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం లను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సు స్టాండ్ రెడ్డిగూడెం ను రెండవ జోన్ గా ఏర్పాటుచేసి బస్సుల అలైటింగ్ పాయింట్స్, మెస్, అధికారులు, ఉద్యోగుల బసను ఏర్పాటుచేశారు. స్థూపం, కోటూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 3, 4 జోన్లలోనూ తప్పిపోయిన వారి కేంద్రాలు, ఓవర్ అల్ మానిటరింగ్ టీమ్స్, షటిల్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేసారు. ఊరట్టం, శివరాం నగర్, పడిగాపూర్, నార్లాపూర్ లను మిగతా జోన్ లుగా విభజించి తగు ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు సంబంధించి సివిల్, నాన్ సివిల్ పనులను 21 ప్రభుత్వ శాఖలు చేపట్టాయి. ఎన్.ఎస్.ఎస్, ఆదివాసీ యూవకులు మొత్తం 2000 వేల మంది ప్రత్యక్షంగా ఈ జాతర నిర్వహణలో స్వచ్ఛందంగా భాగస్వామ్య మవుతున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన దాదాపు 50 వేల మంది అధికారులు, సిబ్బంది ఈ మేడారం జాతరను సక్రమంగా నిర్వహించడానికి నియమించారు. కోటిన్నర మందికి పైగా హాజరయ్యే ఈ జాతర సమయంలో మెరుగైన మొబైల్ సెల్ సేవలను అందించేందుకు బీఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్, జియో తదితర మొబైల్ ప్రొవైడర్లు విస్తృత ఏర్పాట్లు చేపట్టాయి. ఇప్పటికే, 27 మొబైల్ టవర్స్ ఏర్పాటు చేశాయి. మరో, 33 వీల్స్ టవర్లు, 450 వీహెచ్ఎఫ్ సెట్లను ఏర్పాటు చేశాయి.

మందుల చీటీ తారుమారు.. వృద్ధుడి మృతి

- డాక్టర్, కాంపౌండర్‌పై కేసు నమోదు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 21: ఒకే పేరున్న మరో రోగికి ఇచ్చే మందులను పొరపాటున ఆ రోగికి మందుల చీటీలో రాసివ్వడం వల్ల ఒక వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. కామారెడ్డి పట్టణంలోని ఓ ఆస్పత్రిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ విషాదకర ఘటన వైద్య రంగంలోని నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. ఒకే పేరున్న ఇద్దరు వ్యక్తుల విషయంలో వైద్యుడు చేసిన పొరపాటు.. ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. కామారెడ్డికి చెందిన నాగ బాలరాజు(73) అనే వృద్ధుడు గత కొంతకాలంగా నరాల సమస్యతో బాధపడుతున్నారు. దీనికి చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ఆస్పత్రిని ఆశ్రయించారు. బాధితుడి పేరు బాలరాజు కాగా.. అదే సమయంలో ఆస్పత్రిలో అదే పేరుతో(బాలరాజు) ఉన్న మరో డయాబెటిక్(మధుమేహం) రోగి కూడా చికిత్స పొందుతున్నారు. వైద్యుడు నరాల సమస్యతో ఉన్న నాగ బాలరాజుకు.. డయాబెటిక్ రోగికి ఇవ్వాల్సిన మందులను ఈయన మందుల చీటీలో రాసిచ్చారు. నరాల వ్యాధికి బదులుగా హైడోస్ డయాబెటిక్ మందులు వాడటంతో బాలరాజు ఆరోగ్యం క్షీణించింది. రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోవడం, ఇతర దుష్ప్రభావాల వల్ల ఆయన పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ.. అప్పటికే మందులు వికటించడంతో నాగ బాలరాజు మృతిచెందారు. సరైన రోగ నిర్ధారణ చేయకుండా.. కనీసం రోగి వివరాలు సరిచూసుకోకుండా మందులు రాసిచ్చిన ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కామారెడ్డి పోలీసులు ఆస్పత్రి వైద్యుడు, కాంపౌండర్‌లపై కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలోని మెడికల్ రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

“

నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టేతో భేటీ అయ్యాను. గ్రీన్‌లాండ్ సహా ఆర్కిటిక్ ప్రాంతానికి సంబంధించి ఫ్యూచర్ డీల్ ఫ్రేమ్ వర్క్ రెడీ చేశాం. దీంతో ఒక్క యూఎస్ కే కాదు అన్ని నాటో దేశాలకు మంచి జరుగుతుంది. యూరప్ దేశాలపై టారిఫ్స్ విధించట్లేదు. గ్రీన్‌ల్యాండ్‌కు సంబంధించిన గోల్డెన్ డోమ్‌పై మరిన్ని చర్చలు జరుగుతాయి.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

ప్రాంతీయం

ప్రతిపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి

మక్తల్ పట్టణంలోని మంత్రి నివాసంలో క్రీడా, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రతిపక్షం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ప్రతిపక్షం నియోజకవర్గ రిపోర్టర్ మ్యాతారి రేణుక, రిపోర్టర్ నవీన్, రాయికోడ్ డిప్యూటీ సర్పంచ్ మ్యాతారి గోపాల్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరలు పాల్గొన్నారు.

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్

ఎస్సై ని కలిసిన రాయికోడ్ ఉపసర్పంచ్, గ్రామ నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, జనవరి 21: రాయికోడ్ గ్రామ ఉపసర్పంచ్ గా ఎన్నికైన మ్యాతరి గోపాల్ బుధవారం నర్వ ఎస్సై పబ్బతి రమేష్ ను మర్యాద పూర్వకం గా కలిశారు. ప్రభుత్వము ఈనెల 13 నుండి 26 వరకు నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం లో బాగంగా రాయికోడ్ గ్రాంలో ప్రోగ్రాం నిర్వహించి అవగాహన కల్పించాలని ఎస్సై దృష్టికి తీసుకు రావడంతో ఎస్సై రాయి కోడ్ లో కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. ఎస్సై నీ కలిసిన వారిలో నారా వెంకటేష్, మల్లన్ కోటి శంకర్,నౌసు వెంకటయ్య, పింజారి ఖాసీం తదితరులు ఉన్నారు.

గజ్వేల్‌లో ఘనంగా మార్కండేయ స్వామి జయంతి

- స్వామి వారి బోధనలు అనుసరణీయం
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 21: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్ లో మార్కండేయ జయంతి ఉత్సవాలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్థానిక మార్కండేయ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాట్లాడుతూలోక కల్యాణం కోసం తపస్సు చేసిన మహర్షి మార్కండేయుడని, ఆయన ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. సమాజ సేవలో పద్మశాలీలు ముందుండడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దుర్గాప్రసాద్, పద్మశాలి సంఘం ప్రతినిధులు, సంఘం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమిషనర్ హామీతో నిరసన విరమించిన కార్మికులు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 21: మూడు నెలలుగా పారిశుధ్య కార్మికుల జీతాలు రావడం లేదని వారు మున్సిపల్ ఆఫీసు ముందు బుధవారం నాడు నిరసన కార్యక్రమం నిర్వహించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ మున్సిపల్ కమిషనర్ కి ఫోన్ చేసి మాట్లాడడంతో కమిషనర్ రెండు రోజుల్లో వారి జీతాలు ఇస్తానని తెలియజేయ వల్ల వారు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో బిజెపి టౌన్ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ , టౌన్ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు తప్పనిసరిగా హాజరు కావాలి

- ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ ను పర్యవేక్షించిన డిఐఈఓ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 21: ఇంటర్మీడియట్ విద్యార్థులు తప్పనిసరిగా ప్రాక్టికల్ పరీక్షలను రాయాలని, పరీక్షలకు గైరాజ రైతే ఫెయిల్ గా పరిగణిస్తారని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డిఐఈఓ) రవీందర్ రెడ్డి చెప్పారు. బుధవారం ప్రారంభమైన ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను ఆయన పర్యవేక్షించారు. పట్టణంలోని దీక్ష కళాశాల, న్యూ జనరేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) లో జరుగుతున్న ప్రాక్టికల్స్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని, 23న మెగా పేరెంటి టీచర్స్ మీటింగ్ ఉంటుందని, 24న ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్షలకు హాజరు కావాలన్నారు. వచ్చే నెల నుంచి సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయి అన్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌కు 99 46 మంది ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు 99 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు.

సిద్దిపేట మున్సిపాలిటీకి ఐఎస్ఆర్‌సీ అవార్డు

- విద్యార్థుల్లో చైతన్యంపై బెస్ట్ స్కూల్ రన్నర్ అవార్డు దక్కించుకున్న ఇందిరా నగర్ స్కూల్
- పారిశుధ్య నిర్వహణ పై కార్మికుల పని తీరు మెచ్చి అవార్డు
- అభినందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 21: సిద్దిపేట నాడైన.. నేడైనా నిత్యం శుద్ధిపేటనే అని సిద్దిపేట మరో సారి చాటి చెప్పింది... మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు నాడు సంకల్పించిన చెత్త సేకరణ నేడు ఎన్నో అవార్డు లకు ఆదర్శం గా నిలిచింది.. తడి, పొడి హానికర చెత్త సేకరణ పై స్వయంగా హరీష్ రావు వార్డుల్లో పర్యటన చేసి ప్రజల్లో అవగాహన కలిపించారు.. ఆ స్ఫూర్తి తోనే నేటికీ కొనసాగుతుంది అని సిద్దిపేట నిత్యం శుద్ధిపేట నే అని నేడు అవార్డు దక్కించుకుంది. ఇది ప్రజల భాగస్వామ్యం... కౌన్సిలర్స్, అధికారుల పని తీరుకి సమిష్టి కృషి కి నిదర్శనమని ఈ సందర్భంగా వారిని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు అభినందించారు.. ఏన్నో అవార్డు లకు సిద్దిపేట ఆదర్శం గా నిలిచిందని ఇదే స్ఫూర్తి ఎల్లప్పుడూ ఉండాలని చెప్పారు.. శుక్రవారం.. మంగళవారం చెత్త సేకరణ, తడి, పొడి, హానికర వేరు వేరుగా చెత్త సేకరణ పై ప్రజలు చూపించిన చైతన్యం ప్రజలదని అన్నారు.. సిద్దిపేట ప్రజలకు ఇందులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.

అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్, ఇందిరా నగర్ స్కూల్ విద్యార్థులు.

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మంగళవారం, శుక్రవారం రోజున పొడి చెత్త సేకరణ మరియు మిగతా రోజులలో తడి, హానికర చెత్త సేకరణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను సిద్దిపేట పురపాలక సంఘానికి ITC WOW ఈశ్రీ ఫౌండేషన్ సీఎస్ఆర్ (కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వార ఐఎస్ఆర్‌సీ (ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్షిప్) అవార్డును కమిషనర్ అశ్రిత్ కుమార్ గారికి అందజేయడం జరిగింది.గౌరవ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ అవార్డు ముఖ్య ఉద్దేశం విద్యార్థి దశలో ఉన్న పిల్లలకు ప్రతి ఇంటి నుంచి వెలుపడే వ్యర్థాలను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేయు విధానాన్ని అవగాహన కల్పించడం, పొడి చెత్తను పునర్వినియోగం చేయడం ద్వారా లాభాలను వివరించడం. ఈ కార్యక్రమంలో భాగంగా అత్యధికంగా ప్రతిభ కనబరిచే పాఠశాలలకు మరియు పాఠశాల విద్యార్థులకు ఐఎస్ఆర్‌సీ అవార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా సిద్దిపేట పట్టణానికి మంగళవారం , శుక్రవారం పొడిచెత్త సేకరణ మిగతా రోజులలో (5+2) తడి చెత్త సేకరణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను సిద్దిపేట పురపాలక సంఘానికి అవార్డు అందజేయడం జరిగింది. పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది.ఐరేని రాజయ్య, గుర్రం శివరాజవ్వలకు చెత్త సేకరణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను అవార్డును అందజేయడం జరిగింది. పట్టణంలోని ఇందిరా నగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు సైతం ఐఎస్ఆర్సీ రన్నర్ అప్ అవార్డు అందజేయడం జరిగింది. సిద్దిపేట పట్టణంలో పాలకవర్గం మరియు సిద్దిపేట పట్టణ ప్రజల సహకారంతో ప్రతి ఇంటి నుంచి తడి ,పొడి ,హానికర చెత్త వేరు చేసి ఇచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని కమిషనర్ అశ్రిత్ కుమార్ తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ప్రతి మంగళవారం, శుక్రవారం పొడిచెత్త సేకరణ ఇతర రోజులలో తడి చెత్త సేకరణ విధానం 100% అమలు చేయుట అందరు సహకారంతో సిద్దిపేటకు దక్కిందన్నారు. సిద్దిపేట పట్టణాన్ని దేశంలో అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉంచేందుకు పాలకవర్గం, పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.

నూతన కోర్సుల కోసం వినతి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 21: : సిద్దిపేట అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ లో నూతన కోర్సులు ఏం యస్ డబ్ల్యూ, లైబ్రరీ సైన్స్, సర్టిఫికెట్ కోర్సులు, ఏంఎస్సి ప్రారంభించాలని విద్యార్థి నాయకులు చల్ల భరత్ రెడ్డి, సామల్ల రమాకాంత్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాల వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంట చక్రపాణి కి వినతి పత్రం అందజేశారు. ఈ కోర్సులు లేక పోవడం వలన ఇక్కడి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, కావున ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థులతో పాటు చుట్టూ ఉన్న నాలుగు జిల్లాల వారికి ఉపయోగ పడే అవకాశం కలుగుతుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వీ సి సానుకూలంగా స్పందించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు అనిల్ రెడ్డి, యువ కవి చెన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

పూజల హరికృష్ణకు పరామర్శ

ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 21: గత 2 రోజులుగా హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ను రాంపూర్ సర్పంచ్ మహిపాల్ రెడ్డి , బచ్చాయిపల్లి సర్పంచ్ , టౌన్ నాయకులు బొమ్మల యాదగిరి , కలీముద్దీన్ , ఎల్లంయాదవ్ ,యూత్ కాంగ్రెస్ నాయకులు వహాబ్, రషీద్, రూరల్ మండలం నాయకులు గుర్రం అంజిరెడ్డి ,మహేందర్ రెడ్డి ,మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి , చిన్నకోడూరు మండల నాయకులు మీసం మహేందర్ ,శ్రీనివాస్ రెడ్డి , నంగునూరు మండలం నాయకులు దేవులపల్లి యాదగిరి , రాజబదుర్ రెడ్డి ,సురేందర్ రెడ్డి , సంజీవ్ , నర్మెట్ట సాయి, కిషన్ తదితర నాయకులు ఇంటికి వెళ్లి పరామర్శించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాణికి డాక్టరేట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 21: శ్రీకృపా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సిద్దిపేట కు చెందిన బి. నాగరాణి గీతం యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టాను పొందారు. గీతం విశ్వవిద్యాలయానికి చెందిన డా. జి.వి. రాధా మార్గదర్శకత్వంలో ఆమె పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. వై. మంజునాథ్, యాజమాన్యం, అధ్యాపక బృందం విద్యార్థులు బి. నాగరాణి ని అభినందించారు.

మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునీకరణ

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 21: కేంద్ర ప్రభుత్వం అమృత భారత్ పథకంలో భాగంగా మంచిర్యాల రైల్వే స్టేషన్ పనులను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావు తమ నాయకులతో రైల్వే స్టేషన్ జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అన్నిరంగాలలో ముందుకు సాగుతుందన్నారు. అందులో భాగంగా మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునీకరణ నిమిత్తం 30 కోట్ల రైల్వే ఫోటో ఒకటి సుమారు 15 కోట్ల నిధులతో మంచిగా రైల్వే స్టేషన్ ఆధునికరించడం జరుగుతుందన్నారు. రైల్వేస్టేషన్లో అన్ని వసతులు కల్పించి ప్రయాణికులకు సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నూతనంగా సాంకేతిక పరిజ్ఞానంతో రైల్వే స్టేషన్లు సుందరీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ టీఆర్ఎస్ నాయకుల విషయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ టిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర సంపదలు దోచుకుంటూ సిట్ విచారణ పేరుతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. త్వరలో కాంగ్రెస్ టీఆర్ఎస్ పార్టీలకు తమ పార్టీ బుద్ధి చెబుతుందని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో తమ పార్టీకి ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గాజుల ముఖేష్ గౌడ్, పెద్దపెల్లి పురుషోత్తం, మున్నా, రాజు, సిసోడియా, బిజెపి పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజు, రంగ శ్రీశైలం, మేరడిగొండ శీను, వైద్య శ్రీధర్, నడిపెల్లి వెంకటేశ్వరరావు లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 21 : జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని బుధవారం నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, కామారెడ్డి తదితర జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 729 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల విషయమై వచ్చిన అభ్యంతరాలను నిశితంగా పరిశీలిస్తూ పరిష్కరించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తూ, వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉందని, షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా నిఘాను ఉంచేందుకు వీలుగా ఎస్.ఎస్.టీ, ఎఫ్.ఎస్.టీ టీంలను నియమిస్తున్నామని అన్నారు. బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో తగిన సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో నిజామాబాద్ నగర పాలక సంస్థకు సంబంధించిన ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటి కోసం ఈ కళాశాలలో అనువుగా ఉన్న ఆయా విభాగాల గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులతో కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా, అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



ఏఐ కేవలం టెక్ కంపెనీలు, సిటీలకే పరిమితం కాకుడదు. ప్రతి పౌరుడు, రైతులు, విద్యార్థులు, ఎంటర్‌పెన్యూర్స్ అందరికీ దాని బెనిఫిట్స్ దక్కాలి . రాష్ట్రంలో న్యాచురల్ ఫార్మింగ్ కోసం 20లక్షల ఎకరాలు, 18లక్షల మంది రైతులు సిద్ధంగా ఉన్నారు.

- దావోస్‌లో ఏపీ సీఎం చంద్రబాబు

‘మ్యాచ్ ఫిక్సింగ్ వద్దు.. పార్టీని గెలిపించండి’

- మున్సిపల్ ఎన్నికలలో న్యాయంగా పనిచేయండి
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 21:-

జరగబోవు స్థానిక మున్సిపల్ ఎన్నికలలో పార్టీ కార్యకర్తలు న్యాయంగా పనిచేయాలని పార్టీ నిర్ణయించిన వారికే టికెట్లు ఇవ్వడం జరుగుతుందని పార్టీకి నష్టం చేయవద్దని నష్టం చేస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు అన్నాడు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో అయినా మాట్లాడుతూ రామయంపేట మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్ గా పోటీ చేయాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రజల నిర్ణయం మేరకే టికెట్లను కేటాయించడం జరుగుతుందని మైనంపల్లి తెలిపారు. పార్టీలో ఫుల్ టైం కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం జరుగుతుందని ఎన్నికలలో పోటీ చేసేవారు నిత్యం ప్రజలలో ఉండాలని ఆయన తెలిపారు. మంచి మెజార్టీతో గెలిపిస్తే సీఎంతో మాట్లాడి ఎక్కువ నామినేట్ పదవులు తీసుకురావడం జరుగుతుందని మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని మైనంపల్లి హన్మంత్ రావు ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఎవరూ ఇతర పార్టీలతో 'మ్యాచ్ ఫిక్సింగ్' చేయవద్దని, నిజాయితీగా పనిచేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.గతంలో చర్చి కి 30కోట్లు.ఏడుపాయల కు 33కోట్లు రూపాయలతో అభివృద్ధి పరుస్తున్నామని మెదక్ పట్టణానికి 88 కోట్ల రూపాయలతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యకర్తలు నాయకులు ఇతర పార్టీలతో ఎన్నికల అయ్యేవరకు మాట్లాడవద్దని.ఎవిడెన్సీతో ఉంటే సస్పెండ్ చేస్తాం. ఆయన తెలిపారు సర్వే ఆధారంగానే పార్టీ టికెట్లు కేటాయిస్తామని ఆయన తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి మెదక్ వైపు తొంగి చూడకుండా విజయం సాధించే దిశగా పనిచేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు..

రైతు బరోసాపై స్పష్టత ఇవ్వకపోవడంపై రైతుల ఆందోళన..

- ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలి
- రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 21:

ఎన్నికలకు ముందు ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ.15,000 చొప్పున రైతు బరోసా అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు పథకం అమలుపై స్పష్టత ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర రైతుల్లో అయోమయం నెలకొన్నదని సిద్దిపేట జిల్లా రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మా రెడ్డి రామలింగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రైతు సంక్షేమమే లక్ష్యంగా రూపొందించిన రైతు బరోసా పథకాన్ని క్రమబద్ధంగా, పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. ప్రతి పంట కాలంలో రైతులకు భరోసాగా నిలవాల్సిన ఈ పథకం విషయంలో స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్న విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.గత ప్రభుత్వాల కంటే మెరుగైన పాలన, రైతులకు మరింత మేలు జరుగుతుందన్న ఆశతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.రైతుల ఆశలు, విశ్వాసాలు దెబ్బతినకుండా చూడాలంటే రైతు బరోసా పథకం అమలుపై తక్షణమే స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు బరోసా పథకం కింద ప్రతి సంవత్సరం ఏ తేదీ వరకు, ఎంత మొత్తాన్ని, ఏ విధంగా రైతులకు అందించనున్నారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించి, రైతులు అయోమయానికి గురికాకుండా చూడాలని రాష్ట్ర రైతులు వినయపూర్వకంగా కానీ బలంగా కోరుతున్నారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో రైతు రక్షణ సమితి నాయకులు పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, గడ్డం. శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రాము రెడ్డి, దేవేందర్ రెడ్డి, మొత్కు లక్ష్మయ్య, యాదం రావు, సంతోష్ రెడ్డి, భూపతి రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 21:

నంగునూరు ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్టీయూ ఉపాధ్యాయ క్యాలెండర్ ను మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు కట్ట బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంగునూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, అంక్షాపూర్ గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుడు నాగార్జున రెడ్డి, ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కల్లూరు నరసింహులు, ఉపాధ్యాయులు రాజమౌళి, రాంగోపాల్ రెడ్డి, శశికళ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ దయతో ప్రజలందరూ సుబీక్షంగా ఉండాలి

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 21:

శ్రీ మార్కండేయ స్వామి దయతో ప్రజలందరూ సుబీక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బ క్కి వెంకటయ్య లు అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో శ్రీ మార్కండేయ జయంతి సందర్భంగా మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ మార్కండేయ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతోసుబీక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక పద్మశాలి సమాజ కుల పెద్దలు, నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ లో చంద్రబాబు పాలన నడుస్తుంది..

- బిఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి విమర్శ...

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 21:

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. హరీశ్ రావు పై ఎన్ని కుట్రలు పన్నిన కడిగిన ఆణిముత్యంలా బయటకు వస్తాడని వారు అన్నారు. తల,తోక లేని ప్రశ్నలతో ప్రశ్నించే గొంతుకను ఆపలేరన్నారు. గతంలోనే సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసిన ఇంకా బుద్ధి రాలేదన్నారు. పెట్టుబడుల కోసం దావూస్ కి వెళ్ళిన ముఖ్యమంత్రి ఇటీవల హైదరాబాద్ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో ఎంత పెట్టుబడి తీసుకొచ్చారని ప్రశ్నించారు. గ్లోబల్ ఐదు లక్షల పెట్టుబడి 5 లక్షల కోట్ల పెట్టుబడి వచ్చిందని తెలిపారన్నారు. సీఎం ఎక్కడ ఖర్చు పెట్టారో తెలపాలన్నారు. హరీష్‌రావు పై విచారణ పేరుతో వేధిస్తున్నారని మండిపడ్డారు. మీరు ఎన్ని కుట్రలు చేసినా బిఆర్ఎస్ భయపడేది లేదన్నారు. సంక్రాంతి పండుగకు ఆంధ్ర వాళ్లకు ఉచిత టోల్గేట్ ప్రవేశపెట్టి తెలంగాణ ప్రజలకు బస్ టికెట్ ను పెంచిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. తెలంగాణలో చంద్రబాబు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవకపోతే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్తారనీ అన్నారు.

ఎం ఐ ఎస్ జిల్లా అధ్యక్షులుగా అక్కం శేఖర్

ప్రతిపక్షం, దౌల్తాబాద్, జనవరి 21:

జిల్లాలోని ఆయా మండలాల్లో విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఐఎస్ (మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం) కోఆర్డినేటర్ల జిల్లాస్థాయి సమావేశం సిద్దిపేట జిల్లాలోని ఓ ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసుకున్నారు. సందర్భంగా కోఆర్డినేటర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దౌల్తాబాద్ మండల వనరుల కేంద్రం సమగ్ర శిక్ష విద్య శాఖలో పనిచేస్తున్న గొడుగుపల్లి గ్రామానికి చెందిన అక్కం శేఖర్ ను ఎంఐఎస్ జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బాబు, రజిత, ప్రధాన కార్యదర్శిగా తాడెం వెంకటేష్, ట్రెజరర్ కోశాధికారిగా బోయిని రాజశేఖర్, కార్యదర్శులుగా గణేష్,మహేష్, ప్రచార కార్యదర్శిగా పద్మ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అక్కం శేఖర్ మాట్లాడుతూ. సమగ్ర శిక్ష విద్యా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిష్కారం కోసం ఐక్యమత్యంతో కృషి చేస్తానని తెలిపారు.

శాస్త్రీయంగా జంతుగణన

- వన్య ప్రాణుల గణనను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 21

మెదక్ జిల్లా వ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణుల గణన ముమ్మరంగా కొనసాగుతుంది. మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అటవీశాఖ అధికారి జోజీ తో కలిసి బుధవారం పోచారం అభయాఅరణ్యం కింద ఉన్న బూరుగుపల్లి అటవీ ప్రాంతంలో శాస్త్రీయ పద్ధతిలో జరుగుతున్న జంతు గణనను పరిశీలించారు. మూడు రోజులపాటు మాంసాహార జంతువుల గణన తదనంతరం మరో మూడు రోజులపాటు శాకాహార జంతువుల గణన ఉంటుందని అదనపు కలెక్టర్ మేంచు నగేష్ తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి జోజీ మాట్లాడుతూ..మెదక్ జిల్లాలో ఆరు రేంజ్ లు, 98 బిట్ ల లో మాంసాహార జంతు గణన కొనసాగుతుందన్నారు. చిరుత పులులు ఎలుగుబంటి, నిల్ గాయి, కొండ గొర్రె తదితర జంతువుల పాదముద్రలను విసర్జితలు,జంతువుల వెంట్రుకలు,గోళ్ళు, తదితరాలను ఏం స్క్రిప్ట్ యాప్ లో నమోదు చేస్తున్నారాని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మెదక్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ ఐ లక్ష్మణ్, డి టి చరణ్, ఎఫ్ ఆర్ ఓ మనోజ్ కుమార్ , డి ఆర్ ఓ వేణు ,ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇంచార్జ్ మంత్రిని కలిసిన మండల నాయకులు

- గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ

ప్రతి పక్షం, దౌల్తాబాద్, జనవరి 21:

మండల పరిధిలోని పలు గ్రామాలకు అవసరమైన అభివృద్ధి నిధుల కేటాయింపులపై జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి గారిని హైదరాబాద్ సోమాజిగూడలో మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం తగిన నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రాష్ట్రప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన మేరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పడాల రాములు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, మాచిన్‌పల్లి సర్పంచ్ నాగరాజు, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి గణేష్ పంచమి తదితరులున్నారు.

ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాలను రీ షెడ్యూల్ చేయాలి

- టిపిటిఎఫ్ డిమాండ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 21:



ప్రాథమిక పాఠశాలల జనవరి నెల కాంప్లెక్స్ సమావేశాలను రీ షెడ్యూల్ చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గాడిపల్లి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ లు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల జనవరి నెల కు సంబంధించి కాంప్లెక్స్ సమావేశాలను ఈనెల 23 నుండి నిర్వహించుటకు పాఠశాల విద్యా డైరెక్టర్ ఆదేశించడం జరిగిందని కానీ ఈనెల 26వ తేదీన నిర్వహించుకోబోయే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి పాఠశాలలో ఏర్పాట్లు చేసుకోవడం జరుగుతుందని ఈ సమయంలో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంటుందని అందువల్ల ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాలను గణతంత్ర దినోత్సవం తర్వాత రీ షెడ్యూల్ చేయాలని అన్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు.

సిద్దిపేటలో రోడ్డు భద్రతపై గాలిపటాల పండుగ..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 21:

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమంలో భాగంగా నేడు కమిషనరేట్ పరేడ్ మైదానంలో గాలిపటాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి గాలిపటాలు ఎగురవేశారు.మెరిడియన్, అంబిటస్, వికాస్, సెయింట్ మేరీస్ హైస్కూల్ లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం బాధ్యతగా భావించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.గాలిపటాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

- నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి
- ప్రతిభా పరీక్ష విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 21

ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి అన్నారు. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ దేశ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తరచుగా వివిధ ప్రతిభా పరీక్షలను రాసేందుకు ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ , మోడల్ స్కూల్ విభాగాలలోసాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష జరిగింది. ఈ పరీక్షల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలా విభాగంలో వి.అక్షయ (జడ్పీహెచ్ఎస్ నంగునూరు) మొదటి స్థానం, వి.అక్షయ (జడ్పీహెచ్ఎస్ నర్మెట) రెండవ స్థానం, మోడల్ స్కూల్ విభాగంలో ఎస్.వెన్నెల(టీజీ ఎంఎస్ అక్కెనపల్లి) మొదటి స్థానం, టి. శ్రీకృష్ణ (టీజీఎంఎస్ అక్కెనపల్లి)రెండవ స్థానం, కేజీబీవీ విభాగంలో ఎం.గాయత్రి (కేజీబీవీ నర్మెట) మొదటి స్థానం, కె.సాహితి (కేజీబీవీ నర్మెట్ట) రెండవ స్థానం సాధించారు. విజేతలైన విద్యార్థులు ఫిబ్రవరి 2న జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారని నిర్వాహకులు జిల్లా ఆర్థిక కార్యదర్శి వై రాంగోపాల్ రెడ్డి, నంగునూరు మండల బాధ్యులు దీకొండ గోవర్ధన్ తెలిపారు. విజేతలకు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన నంగునూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి, అంక్షాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగార్జున రెడ్డి, తదితరులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బుడు రవీందర్ రెడ్డి, కొత్తపల్లి రవి, బీరకాయల తిరుపతి, దుద్దెడ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

“

‘ప్లాట్‌ఫామ్ ఇంజినీరింగ్, ట్రేడింగ్ అల్గారిథమ్స్‌పై దృష్టి సారిస్తూ విశాఖలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పండి. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకో సిస్టమ్ బలోపేతానికి లీడ్ మెంటర్‌గా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో భాగస్వామ్యం వహించండి. కాలేజ్ స్థాయి వరకు ఫైనాన్సియల్ లిటరసీ కార్యక్రమం అమలుకు సహకరించండి’

- జెరోదా ఫౌండర్ నిఖిల్ కామత్‌తో ఏపీమంత్రి లోకేశ్

ప్రాంతీయం

'ప్రతిపక్షం' క్యాలండర్ ఆవిష్కరించిన పీసీసీ చీఫ్ మహేష్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 21 :
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో "ప్రతిపక్షం" క్యాలండర్ 2026 ను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. బుధవారం నిజామాబాద్ లో పీసీసీ మహేష్ తన నివాసంలో క్యాలండర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షం దిన పత్రిక వార్తల ప్రచురణలో తనకంటూ ప్రత్యేక స్థానం సాధించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతం, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పురోగతి సాధించాలి

- బాధితులకు పరిహారం అందించాలి.
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ .

ప్రతిపక్షం,మెదక్ టౌన్, జనవరి 21
మెదక్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ సమావేశం బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తో పాటు ,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ తోపాటు జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. కుల నిర్మూలన జరగాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పురోగతి సాధించాలని, బాధితులకు సత్వరమే పరిహారం అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫాస్ట్ ట్రాక్కోర్టును ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పురోగతికి చర్యలు చేపడుతున్నట్లు, బాధితులకు పోలీస్ శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లాలో ఎస్సీ ,ఎస్టీ లలో అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కరించాలని, జనవరి 26వ తేదీన అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలని, బాధితులకు పరిహారం ఇవ్వడంలో ఆలస్యమైతుందని, ఎవరైనా బాధితుల పిల్లలు ఉంటే వారికి విద్య, వైద్యం అందించాలని, జిల్లాలో పౌర హక్కుల దినోత్సవం క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగారావు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి,తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, మెదక్ ఆర్డిఓ రమాదేవి, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి

- పీసీసీ మహేష్ కు బీసీ సంఘం నాయకుల వినతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 21 :
జనాభాలో దాదాపు 60 శాతం ఉన్న బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు సరిపోవు కాబట్టి జనరల్ స్థానాల్లో 50 శాతం సీట్లను కాంగ్రెస్ పార్టీ కేటాయించాలని కోరుతూ పీ సీ సీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా నాయకులు వినతి పత్రాలు ఇచ్చారు. రెండు రోజులపాటు జిల్లా పర్యటనకు విచ్చేసిన పిసిసి అధ్యక్షుడికి నిజామాబాదులో ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పించడం హర్షణీయమే కాన, కొందరు బీసీ వ్యతిరేకులు కోర్టుకు వెళ్లడంతో బీసీలకు న్యాయంగా దక్కవలసిన రిజర్వేషన్లు దక్కకుండా పోయాయని అన్నారు. కాబట్టి ఈ పరిస్థితుల్లో రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో 50 శాతం సీట్లను బీసీ అభ్యర్థులకు కేటాయించాలని నరాల సుధాకర్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కోరారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారిని కలిసిన వారిలో నరాల సుధాకర్ తో పాటు కొయ్యాడ శంకర్, శ్రీలత, చంద్రకాంత్, సాయి బసవ, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం.. నిరుపేద ప్రజల పక్షం

- ప్రతిపక్షం క్యాలెండర్ ను ఆవిష్కరించిన. హసన్ పర్తి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 21
అక్షరాలను అగ్నికనంగా మలిచి ప్రజల గొంతుకగా... ప్రతిపక్షం పత్రిక నిత్యం నిజం వార్తలు రాస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రతిపక్షం క్యాలెండర్.. జిల్లా ప్రముఖ పాత్రికేయులు రౌతు రమేష్.. ఆధ్వర్యంలో ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రేటర్ వరంగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనపర్తి కిరణ్. హసన్ పర్తి ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు. పెద్దమ్మ రాము నర్సింహులు. మరియు. మాజీ సర్పంచ్ పుల్లా రవీందర్ హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గౌర్రె కిరణ్ కుమార్. మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగుళ్ల సురేష్. ఇతరులతో కలిసి క్యాలెండర్ను ఆవిష్కరించారు...హసన్ పర్తి మండల కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు మాట్లాడుతూ.. నిత్యం వార్తలతో ప్రజల మనసును సుస్థిర స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు ప్రజలకు ప్రభుత్వాలకు ప్రతినిధులకు అనుసాఆనంద కర్తగా. పనిచేస్తూ ఎన్నో దశాబ్దాలుగా నిష్పక్ష ప్రజల విశ్వాసాన్ని విలువలతో కూడిన జర్నలిజం చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవడంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు పత్రికలు సమాజానికి అర్థం పడతాయని ప్రజాస్వామ్య విలువలతో కూడిన న్యూసినిమా ప్రజలకు అందించాలని ప్రతిపక్షం పత్రిక ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోవడం సంతోషకరం అని అన్నారు నూతన సంవత్సరంలో ప్రతిపక్షం పేదల పక్షాన ప్రభుత్వంతో కొట్లాడి ప్రజలకు అన్ని విధాల నికార్సైన నిదారమైన న్యూస్ అందించాలని కొత్త టెక్నాలజీతో ముందుకు పోవాలని కోరారు ఈ కార్యక్రమంలో 66 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధ్యక్షులు కనపర్తి కిరణ్. మాజీ సర్పంచ్ పుల్ల రవి. ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు పెద్దమ్మ నరసింహ రాములు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గౌర్రె కిరణ్ కుమార్.హసన్ పర్తి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగుళ్ల సురేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు

కామారెడ్డిలో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- దొంగిలించిన వాహనాలు స్వాధీనం
- జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర వెల్లడి

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 21:
కామారెడ్డిలో బుధవారం పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 9, 10 తేదీల్లో నాలుగు షట్టర్ లను లిఫ్ట్ చేసి దొంగతనాలు, రెండు ద్విచక్ర వాహనముల దొంగతనం జరిగిందని పిర్యాదు రాగా వెంటనే కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేసి విచారణ ప్రారంభించడం జరిగింది. జిల్లా యస్పి సూచనల మేరకు ఏఎస్పి గారి ఆద్వర్యములో కామారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్, సిసియస్ ఇన్స్పెక్టర్, వారి వారి సిబ్బందితో టీం లుగా ఏర్పడి నేరస్తుల కదలికలు గమనించడానికి కామారెడ్డి, పరిసరప్రాంతాల సిసిటివి కేమరాలను పరిశీలించి, ఇతర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిన్న తేదీ 21 నాడు కామారెడ్డి పట్టణంలోని డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకోవడం జరిగింది. వారిని విచారించగ వారు ఒక నలుగురి ముఠా సభ్యులుగా ఏర్పడి వీరు ప్రధానంగా రాత్రి, తెల్లవారుజామున ఎవరు లేని సమయములో మెయిన్ రోడ్ల పక్కన ఉన్న తాళం వేసిన షాపులను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారు . ముందుగా దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ ప్రాంతాన్ని రెకి చేసి, ఒకరు లేదా ఇద్దరు కాపలా ఉండగా మిగిలినవారు మాస్కులు, గ్లౌజులు ధరించి ఇనుప రాడ్లతో షట్టర్లను లేపి లోపలికి ప్రవేశిస్తారు. లోపల ఉన్న క్యాష్ డ్రాయర్లు, కౌంటర్లలోని నగదును మాత్రమే వేగంగా దొంగిలించి బయటకు వచ్చి ముందుగా సిద్ధంగా ఉంచిన దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై పారిపోతున్నారు. వారి వాహనములను గుర్తుపట్టకుండా ఉండేందుకు నెంబర్ ప్లేట్లు తొలగించడం, పారిపోతున్న సమయములో పోలీసుల కనిపిస్తే వాహనాన్ని వదిలేసి గల్లీలు, పొదల మధ్యగా పారిపోయి మరొక వాహనాన్ని దొంగిలించి పారిపోతున్నారు. దొంగతనంలో వచ్చిన నగదును సమానంగా పంచుకుని వేర్వేరు ప్రాంతాలకు పారిపోతున్నారు. ప్రస్తుతం A1, A2 లు పరారీలో ఉన్నారు. వీరిని త్వరలో పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయడం జరిగింది. పైన తెలిపిన నలుగురు నిందితులు కామారెడ్డిలో పట్టుబడ్డారు.ఈ కేసులో దొంగతనాలకు ఉపయోగించిన 1) TVS రైడర్ ద్విచక్ర వాహనం. 2)ఇతర నేరాలకు ఉపయోగించిన మరొక ద్విచక్ర వాహనం, 3) ఇనుప రాడ్లు, 4) మాస్కులు, గ్లౌజులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. గతంలో కూడా ఇలాంటి నేరాలలో పాల్గొన్న చరిత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు.కామారెడ్డి ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని యస్పి గారు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఇట్టి కేసు ఛేదనలో, పరశోధనలో చాకచక్యముగా వ్యవహరించిన, పట్టణ ఇన్స్పెక్టర్, నరహరి, సిసియస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, యస్ఐ బాల్ రెడ్డి, గాంధారి యస్ఐ ఆంజనేయులు, సిసియస్ యస్ఐ ఉస్మాన్, జె రవి, శ్రీనివాస్, గణపతి, రాజేందర్, లక్ష్మీకాంత్, కమలాకర్, రాజు నాయక్ కానిస్టేబుల్ లను జిల్లా యస్పి అభినందించడం జరిగింది.

మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నాం

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 21:
రాబోయే మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల కు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మున్సిపల్ లో కామారెడ్డి మున్సిపల్ పరిధిలో వార్డులు 49, బిచ్కుంద మున్సిపల్ పరిధిలో 12 వార్డులు, బాన్సువాడ మున్సిపల్ పరిధిలో 19 వార్డులు, ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో 12 వార్డులలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు కామారెడ్డి 152, ఎల్లారెడ్డి 24, బాన్సువాడ 39, బిచ్కుంద 24 కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు నామినేషన్ కేంద్రాలలో CC కెమెరా లను ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా వెబ్ కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పి ఓ లు, ఓ పి ఓల నియామకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అలాగే BNS 163 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి కామారెడ్డి , ఖమ్మం, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్నికల అధికారులు/కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్నికలలో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, పి ఓ, ఓ పి ఓ లకు శిక్షణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి సన్నద్ధతతో ఉండాలి

- రాష్ట్ర ఎన్నికలకమిషనర్ రాణి కుముదిని

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 21
మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని స్థాయిల్లో పూర్తి సన్నద్ధతతో ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ...సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్లు స్వీకరించే కేంద్రాల్లో గోడ గడియారం ఏర్పాటు చేయడంతో పాటు, నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆర్ఓలు, ఏఆర్ఓల నియామకాలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది నియామకంలో 20 శాతం అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నూరు శాతం బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉండాలని, పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను వివరాలు అడగగా వాటి వివరాలను కలెక్టర్ వెల్లడించారు. హనుమకొండ జిల్లాలో పరకాల మున్సిపల్ లో 22 వార్డులు ఉన్నాయని తెలియజేశారు. ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి టీమ్ లను ఏర్పాటు చేశామని, పోలింగ్ మెటీరియల్ను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సరిపోను బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నామినేషన్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు గుర్తించినట్లు చెప్పారు. ఆర్వోలు, ఏఆర్వోలను అపాయింట్మెంట్ చేశామని తెలియజేశారు. పరకాల మున్సిపల్లో 22 వార్డుల్లో 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కి తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి కాజీపేట కొత్త బ్రిడ్జి పనుల పరిశీలన

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 21
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు రాజేందర్ రెడ్డి బుధవారం కాజీపేట కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రిడ్జి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్న ఆయన, నెల రోజుల్లో వాహన రాకపోకలకు పూర్తిగా సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా 48వ డివిజన్ అధ్యక్షులు సింగారపు రవి ప్రసాద్, కెంపూ. రమేష్, స్థానిక మాజీ కార్పొరేటర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం హనుమకొండ జనవరి 21
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ హసన్పర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గౌరిశెట్టి సత్యనారాయణ గారి తల్లి గారైన గౌరిశెట్టి కనకలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించగా నేడు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు ...అనంతరం 65వ డివిజన్ నిఫూర్ నగర్ తండా కి చెందిన భూక్యా భీమా నాయక్ తండ్రి గారైన భూక్యా రాములు ఇటీవల అనారోగ్యంతో మరణించగా నేడు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఎమ్మెల్యే గారి వెంట ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను ప్రజలు విశ్వసించవద్దని, వాస్తవాలు, పనులే తన పాలనకు నిదర్శనం

గ్రేటర్ వరంగల్ హసన్ పర్తి 66 డివిజన్
వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నేడు 66వ డివిజన్ గాంధీ విగ్రహం సమీపంలో సుమారు రూ. 1 కోటి 20 లక్షల నిధులతో సీసీ రోడ్ & డ్రైనేజ్ నిర్మాణ పనులకు , విజయ గార్డెన్స్ సమీపంలో రూ. 14 లక్షల వ్యయంతో పైప్‌లైన్ పనులకు, అలాగే హసన్పర్తి పెద్ద చెరువు వద్ద రూ. 4.99 లక్షల నిధులతో ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు వరంగల్ ఎంపీ శ్రీమతి కడియం కావ్య, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి గార్లతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి *శ్రీ కేఆర్ నాగరాజు వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి తమ జీవిత లక్ష్యమని, ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పాలన అందించడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు..ఈ కార్యక్రమంలో హసన్ పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ బ్లాక్ & ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగిలపల్లి తిరుపతి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనపర్తి కిరణ్ ఎర్రగట్టుగుట్ట చైర్మన్ ఆ రెల్లి వెంకటస్వామి. ముదిరాజ్ సంఘం మాజి అధ్యక్షులు పెద్దమ్మ రాం నర్సింలు. మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్. ఎర్రగట్టుగుట్ట మాజీ చైర్మన్ జన్ను రవీందర్ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోరకిరణ్ కుమార్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బిగుళ్ల సురేష్. ఈవీసం సురేందర్ రెడ్డి తాళ్ల మధు. గరిగరాజు. పల్లెపు అనుష. ప్రభాకర్. శ్రీను. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

“



రాజాసాబ్ ను రూ.100 కోట్లతో రీజనల్ సినిమాగా తీసుంటే లాభాలు వచ్చేవి. ఈ మూవీని తొలుత తక్కువ బడ్జెట్ లో తీయాలనుకున్నారు. తర్వాత పాన్ ఇండియా ఆలోచనతో పదేపదే స్క్రిప్ట్ మార్చారు. దీంతో అసలు కథ తెరకెక్కలేదు. మేకర్స్‌కు పాన్ ఇండియా ఆలోచన వస్తే చేసే మార్పులు కొన్నిసార్లే సక్సెస్ ఇస్తాయి.

- డైరెక్టర్ తమ్మారెడ్డి భరద్వాజ

మహాశివరాత్రికి అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలి

ప్రతిపక్షం హనుమకొండ జనవరి 21.

మహాశివరాత్రి పర్వదినానికి అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, వేద పండితులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేయి స్తంభాల దేవాలయం వద్ద నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడ కూడా అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భక్తులకు ఏ చిన్న సమస్య తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ గతంలో చేసిన ఏర్పాట్ల కంటే ఈ ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేవిధంగా ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. టెండర్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ మహాశివరాత్రి ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలన్నారు. మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేసి విజయవంతంగా నిర్వహించాలన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వేయి స్తంభాల దేవాలయంలో తాగునీటి సరఫరా చేస్తామని, తాత్కాలిక టాయిలెట్ల నిర్మాణ పనుల ప్రతిపాదనలు తయారు చేశామని, వాటిని పూర్తి చేస్తామన్నారు. వేయి స్తంభాల దేవాలయం, మెట్టుగుట్ట ఆలయాల వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ చేపడుతామన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉప కమిషనర్ రామల సునీత మాట్లాడుతూ హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయం, మడికొండలోని మెట్టు రామలింగేశ్వర ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలకు దేవాదాయ శాఖ తరపున భక్తుల దర్శనం నిమిత్తం ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వేయి స్తంభాల దేవాలయం ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఐదు రోజులపాటు జరుగుతాయని, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్, డిఆర్ఓ వైవి గణేష్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ఏసిపి నరసింహారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, ఇతర శాఖల అధికారులతో పాటు వేద పండితులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో రూ 31.70 కోట్లతో అభివృద్ధి పనులు

- 13 వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 21 : సంగారెడ్డి మున్సిపాలిటీ లో 31.70 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీ పరిధి లోని 13 వార్డుల్లో స్థానిక నాయకులతో కలిసి ఆమె కొబ్బరి కాయ కొట్టి లాంఛనంగా శంకుస్థాపన చేశారు. రూ.31.70 కోట్ల హెచ్ఎండీఏ, యూఐడీఎఫ్ నిధులతో సంగారెడ్డి మున్సిపాలిటీ లో పలు వార్డుల్లో సిసి రోడ్లు , డ్రైన్ లతో పాటు 3 కోట్ల రూపాయల తో రాజీవ్ పార్క్ సుందరీకరణ, 2 కోట్లతో రాజంపేట నుండి ఈద్గా వరకు ఫిల్టర్ బెడ్ రోడ్ నిర్మాణానికి ఈ రోజు శంఖుస్థాపన లు చేశారు. ఈ కార్యక్రమం లో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోంగుల రవి, అశోక్ రెడ్డి, కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

"అరైవ్ అలైవ్ 2026" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.. రోడ్డు భద్రతపై విద్యార్థులకు దిశా నిర్దేశం.
- ట్రాఫిక్ నిబంధనలు పాటించి, మీకు, ఇతర వాహనదారులకు రక్షణ కల్పించండి.
- గమ్యస్థానానికి చేరుకోవడమే కాదు... సురక్షితంగా చేరుకోవడమే ముఖ్యం
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 21 :

"అరైవ్ అలైవ్ 2026" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలలో భాగంగా జహీరాబాద్ పట్టణంలోని ఎన్కన్వెన్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిచడం జరిగింది. పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యం, బస్ డ్రైవర్లు, పట్టణ యువత, లారీ, ఆటో డ్రైవర్లు సుమారుగా 3500 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కి విద్యార్థులు ట్రాఫిక్ అవగాహనపై ఆటలు, పాటల ద్వారా ఘన స్వాగతం పలికారు. రోడ్డు భద్రతపై సిద్ధార్థ్ విద్యార్థి ఇచ్చిన స్పీచ్ కు ఎస్పీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమమే "అరైవ్ అలైవ్ - 2026" అని అన్నారు. విద్యార్థులే భవిష్యత్తుకు బాధ్యతాయుత పౌరులని, చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకుని తమ తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా ప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ వాహనాన్ని నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలకు దారితీసే అవకాశం అధికంగా ఉంటుందని హెచ్చరించారు. ఓవర్ స్పీడ్ క్షణిక ఆనందం ఇవ్వవచ్చుగానీ, ప్రాణాపాయానికి దారితీయవచ్చని పేర్కొన్నారు.అనంతరం జిల్లా ఎస్పీ "అరైవ్ అలైవ్ - 2026" సబ్ డివిజన్ పోలీసు సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. హెల్మెట్ తలకే కాకుండా మొత్తం కుటుంబానికి రక్షణ ఇస్తుందని గుర్తు చేశారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా అవగాహనలో భాగంగా మహిళా కానిస్టేబుల్ వనజ ట్రాఫిక్ నియమాలను ప్రతిబింబించేలా అందమైన రంగురంగుల ముగ్గును రూపొందించి, ట్రాఫిక్ నియమాలను కళ్లకు కట్టినట్లు చిత్రీకరించిదని వనజను జిల్లా ఎస్పీ గారు అభినందించి, సత్కరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సీనియర్ సివిల్ జడ్జ్ కవిత, సి.డి.పి.ఓ సుశీల, డిఎస్పీ సైదా నాయక్, ఎం.ఆర్.ఓ. ధశరత్, ఆర్డీఓ దేవజీ నాయక్, మోటార్ వెహికల్ వెంకటయ్య, ఐ.సి.డి.ఎస్ , డి.డి.పి.ఓ, మహిళా సంఘాలు, ప్రాజెక్ట్ మేనేజర్స్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్లు, యువత, సబ్ డివిజన్ పోలీసు అధికారులు సిబ్బంది స్కూల్, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ టికెట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 21 :

మెదక్ మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ రావు సూచన మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 32 వార్డుల నుంచి 186 టికెట్ ఆశిస్తున్న వారు దరఖాస్తులు అందజేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మందుగుల గంగాధర్ మాజీ చైర్మన్ చంద్రపాల్. కాంగ్రెస్ నాయకులు మున్నా. ఆంజనేయులు గౌడ్. దరఖాస్తులను సేకరించారు

ఎమ్మెల్యే ఫండ్ ఇవ్వని ప్రభుత్వం ప్రజలకు ఏం ఒరగబెడుతుంది

- నగర సుందరికరనే నా ధ్యేయం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 21 :

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా గెలిచి రెండు యేండ్లు గడుస్తున్న తనకు రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే ఫండ్ కింద ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ అన్నారు. ఇది చేతకాని ప్రభుత్వం అని దుయ్యబట్టారు. బుధవారం జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మేయర్ పీఠం తమదేనని మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మూడు నుంచి ఐదు సీట్లు రావని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏం సాధించారని మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ముందుకు వచ్చి ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయినప్పటికీ ముఖ్యంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఏం సాధించి పెట్టారని రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏం మొహం పెట్టుకొని ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతారని కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీజేపీ ఎక్కడ ఉందో అక్కడ అభివృద్ధి విశ్వాసం ఉంటుందని ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడిందన్నారు. రాబోయే ఇందూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని అన్ని సర్వేల్లో చెబుతున్నాయని మరి ముఖ్యంగా కాంగ్రెస్ చేపట్టిన సర్వేలో కూడా అదే వెలువడిందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమాలలో పబ్లిక్ హెల్త్ ఏఈ శంకర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో గీతం వాణి

- ప్రతిష్టాత్మక సదస్సులో కీలకోపన్యాసం చేసిన సీఎస్ఈ అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 21 :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని సీఎస్ఈ విభాగం అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్ లో స్మార్ట్ ట్రెండ్స్ (స్మార్ట్ కామ్ 2026) పదో అంతర్జాతీయ సమావేశం ప్రారంభోత్సవంలో అతిథిగా పాల్గొని, కీలకోపన్యాసం చేశారు. సమకాలీన పరిశోధన దిశ, కంప్యూటింగ్, కమ్యూనికేషన్ల డొమైన్ లలో ఇటీవలి సాంకేతిక పురోగతిపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. ఆమె ప్రసంగం సదస్యుల మన్ననలను పొందింది. పూణే (మహారాష్ట్ర)లోని క్రౌన్ ప్లాజా సిటీ సెంటర్ లో హైబ్రిడ్ విధానంలో ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశంలో ప్రపంచ నలుమూలల నుంచి పలువురు ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొంటున్నారు. గ్లోబల్ నాలెడ్జ్ రీసెర్చ్ ఫౌండేషన్ (జీకేఆర్ఎఫ్), జీ.ఆర్. స్కాలస్టిక్ ఎల్ఎల్ పీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు నాలెడ్జ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ ఛాంబర్ పార్టనర్ గా, స్ప్రింగర్ పబ్లికేషన్ పార్టనర్ గా వ్యవహరిస్తున్నాయి.అత్యాధునిక పరిశోధన, ఇన్ఫర్మేషన్, కంప్యూటర్ కమ్యూనికేషన్స్ లో ఉద్భవిస్తున్న ధోరణులపై ఈ సమావేశం దృష్టి సారించింది. పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు తమ జ్ఞానం, ఆలోచనలను ఒకరితో మరొకరు పంచుకోవడానికి ఈ సదస్సు తోడ్పడుతోంది. దాదాపు 50కి పైగా దేశాల నుంచి 400కి పైగా పరిశోధనా పత్రాలను పరిశోధకులు సమర్పించారు.డాక్టర్ ప్రీతి విశిష్ట విద్యా నైపుణ్యం, పరిశోధన నాయకత్వం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఉన్నత విద్యకు చేసిన గణనీయమైన కృషిని ఈ ప్రాతినిధ్యం ప్రతిబింబిస్తోంది.

భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి
- అడిషనల్ కలెక్టర్ మాధురి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 21 :

భూభారతికి ప్రాధాన్యతనిచ్చి పెండింగ్లో ఉన్న అన్ని భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ మాధురి తహసిల్దార్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లతో భూభారతి దరఖాస్తుల పురోగతి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)లో భాగంగా చేపట్టిన ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా రోజువారీ లక్ష్యాలను నిర్ధారించుకొని పనులు పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై తహసిల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా క్లియర్ చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై మండలాల వారీగా ప్రతిరోజూ సమీక్షించి నివేదికలు అందించాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు సూచించారు. భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో ప్రక్రియను పూర్తిచేయాలని అన్నారు.అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)లో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈఆర్వో (ఎరో) వారీగా రోజువారీ పురోగతి నివేదికలు సేకరించి క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆర్డీవోలకు సూచించారు. ఎలాంటి జాప్యం జరగకుండా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో అడిషనల్ కలెక్టర్ పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రతిపక్షం సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 21 :

బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబిన్ ను ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని కేంద్ర బీజేపీ కార్యాలయంలో ఆయనకు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిన బిజెపిలో అతి చిన్న వయసులోనే జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికల కావడం శుభ పరిణామం అన్నారు.. ప్రధాని మోదీ సూచనలు.. కొత్తగా ఎన్నికైన నితిన్ నబిన్ నాయకత్వంలో రానున్న రోజుల్లో దేశంలో బీజేపీ మరింత బలోపేతం కావడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపాలిటీ బీజేపీ గెలుచేలా ప్రణాళిక సిద్ధం చేయాలని నూతన అధ్యక్షులు సూచించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మీద అలుపెరుగనిపోరాటం చేయాలని సూచించారని తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, వినూత్న ఆలోచనలు

- అనుభవాత్మక అభ్యాసాన్ని పెంపొందించేందుకు విజ్ఞాన ప్రదర్శన.
- ఎస్ఐఎస్ఎఫ్–2026లో విద్యార్థుల సందడి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 21 :

తెలంగాణ రాష్ట్ర ఎస్సీఈఆర్టీ (స్కర్ట్) మరియు వి ఐ టి ఎం బెంగళూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న దక్షిణ భారత విజ్ఞాన ప్రదర్శన-2026 (సదర్న్ ఇండియా సైన్స్ ఫెయిర్-2026) ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా ఆర్.సి.పురం మండలం కొల్లూర్లోని గాడియం స్కూల్ క్యాంపస్లో ఘనంగా కొనసాగుతోంది. ఈ విజ్ఞాన ప్రదర్శన 1901 2026న ప్రారంభమై 23012026తో ముగియనుంది. విజ్ఞాన ప్రదర్శన మూడో రోజు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిరంతర సందర్శనలతో ఉత్సాహభరితంగా కొనసాగింది. విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనల్లోని వివిధ ప్రాజెక్టులను పరిశీలిస్తూ, ఇంటరాక్టివ్ సెషన్లలో చురుకుగా పాల్గొంటూ కనిపించారు.దక్షిణ భారతదేశానికి చెందిన ఆరు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ మార్గదర్శక ఉపాధ్యాయులతో కలిసి ఈ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని, తమ వినూత్న ప్రాజెక్టులు, ఆలోచనలను ప్రదర్శించారు. స్మార్ట్ దోమల నివారణ జాలం, ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం (ఆంధ్రప్రదేశ్), సెన్సార్ల సహాయంతో నడుస్తున్న బస్సుల్లో అగ్ని ప్రమాదాలను నివారించే విధానం, పాఠశాల స్థాయిలో వ్యర్థాల నిర్వహణ వంటి అనేక అద్భుతమైన విజ్ఞాన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి.ఈ ప్రదర్శనలు విద్యార్థుల లోతైన శాస్త్రీయ అవగాహనను, వాటిని వాస్తవ జీవిత సమస్యల పరిష్కారానికి వినియోగించే సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఒక సందర్శక ఉపాధ్యాయుడు తెలిపారు.ప్రదర్శిత ప్రాజెక్టులను నిపుణులైన న్యాయనిర్ణేతలు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం మూల్యాంకనం చేశారు. మూడో రోజు నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్లు విజ్ఞాన ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ రోజున తల్లిదండ్రుల సైతం చురుకైన భాగస్వామ్యం కనిపించడంతో, ఈ కార్యక్రమం అందరికీ అనుభవాత్మకమైన అభ్యాస వేదికగా మారింది.ఎస్ఐఎస్ఎఫ్-2026 మూడో రోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని 7 జిల్లాల నుంచి 187 పాఠశాలలకు చెందిన సుమారు 10,173 మంది విద్యార్థులు ఈ విజ్ఞాన ప్రదర్శనను సందర్శించినట్లు అంచనా.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, వినూత్న ఆలోచనలు మరియు అనుభవాత్మక అభ్యాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

టీ20 వరల్డ్ కప్ ఈ సారి ఇంట్లో కూర్చొని చూడడం నాకు కొత్త ఎక్స్ పీరియన్స్ అవుతుంది. 2007 నుంచి 2024 వరకు అన్ని టీ 20 వరల్డ్ కప్ లలో ఆడాను. ఈ సారి స్టేడియంలో ఎక్కడో కూర్చొని లేదా ఇంటి నుంచి చూడడం డిఫరెంట్ గా ఉంటుంది.

- రోహిత్ శర్మ

ప్రాంతీయం

ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- నిజామాబాద్ ఇంచార్జీ మంత్రి సీతక్క

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 21 :

ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అన్నారు. హెల్మెట్ సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, డ్రంకన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్ లో డ్రైవింగ్ లాంటి ఉల్లంఘనలు ప్రమాదాలకి కారణం అన్నారు. బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన Arrive Alive కార్యక్రమంలో భాగంగా జాగిర్యాల్ ఎక్స్ రోడ్ నుండి బడా భీమ్గల్ రోడ్ వరకు బైక్ ర్యాలీలో నిజామాబాద్ ఇంచార్జీ మంత్రి సీతక్క పాల్గొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ కాంగ్రెస్ ఇంచార్జి సునీల్ కుమార్ రెడ్డి , సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, భీంగల్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు తిరుపతి, అనిల్ రెడ్డి, రాము పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

చింతమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన సదస్సు

ప్రతిపక్షం బ్యూరో సిద్ధిపేట జనవరి 21:

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో స్థానిక జెడ్పీ హెచ్ ఎస్ చింతమడక పాఠశాల ఆవరణలో బుధవారం ఫైనాన్షియల్ లిటరసీపై ప్రత్యేక అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన బ్యాంకు అధికారులు నిర్వహించారు. స్టేట్ డైరెక్టర్ జమ్మూ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులకు ఆర్థిక వ్యవహారాలపై మౌలిక అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పొదుపు ప్రాముఖ్యత, బ్యాంకు ఖాతాల వినియోగం, ఏటీఎం, డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాల నుంచి రక్షణ వంటి అంశాలను సరళమైన ఉదాహరణలతో వివరించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్త రాజిరెడ్డి అధ్యక్షత వహించగా, గ్రామ సర్పంచ్ లతా శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే గ్రామ వైద్యాధికారులు, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు ఆర్థికంగా స్వావలంబన సాధించాలంటే ఫైనాన్షియల్ లిటరసీతో పాటు డిజిటల్ లిటరసీ కూడా ఎంతో అవసరమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తలు, భద్రతా చర్యలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆర్థిక చైతన్యం పెరిగిందని, భవిష్యత్తులో వారి జీవితాల్లో ఇది ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇటువంటి అవగాహన సదస్సులు గ్రామీణ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ప్రతి పక్షం, దౌల్తాబాద్, జనవరి 21:

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను వృత్తి విధుల్లో బాధ్యతలు పెంపొందించడానికి స్వయం పరిపాలన దినోత్సవం ఎంతో అవసరమని ఎంఈఓ గజ్జల కనకరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు వివరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా విద్యాధికారిగా మనోజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా అశ్విని, మిగతా ఉపాధ్యాయులుగా, వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయుల శ్రీనివాస్, రజిని, వసుంధర, మహేశ్వరి, నగేష్, మోహన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ టికెట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 21 :-

మెదక్ మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ రావు సూచన మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 32 వార్డుల నుంచి 186 టికెట్ ఆశిస్తున్న వారు దరఖాస్తులు అందజేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మందుగుల గంగాధర్ మాజీ చైర్మన్ చంద్రపాల్. కాంగ్రెస్ నాయకులు మున్నా. ఆంజనేయులు గౌడ్. దరఖాస్తులను సేకరించారు

వరంగల్ కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 21

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు సంబంధించి కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణను వీలేరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా, వీలేరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నవీన్‌ను కమలాపూర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

- కవితను వేధించిన నేతలకు తగిన బుద్ధి చెప్తాం
- బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల చైతన్యం తమ లక్ష్యం
- జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 21:

రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను వేధించిన ప్రతి ఒక్కరికీ తగిన బుద్ధి చెప్తామని, అలాగే ఇందుకు సహకరించిన నేతలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలను చైతన్యం చేస్తూ వారికి జరుగుతున్న అన్యాయాలను వివరిస్తామని తెలిపారు. చీకటి ఒప్పందాలతో ముందుకు వెళుతున్న కాంగ్రెస్, బిజెపి పార్టీలను కనుమరుగు చేయడమే తమ లక్ష్యం కాగా, త్వరలోనే పార్టీ స్థాపనతో సత్తా చాటుతామని చెప్పారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలకు దీటుగా జాగృతి ఎదుగుతున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం దర్యాప్తు జరపాలని, అవినీతి సొమ్మును కక్కించాలని డిమాండ్ చేశారు. ప్రతి శాఖలో అవినీతి చోటు చేసుకోగా, ఒక్కొక్కటిగా బయటపడుతున్నప్పటికీ చీకటి ఒప్పందంతో బిఆర్ఎస్ నేతలను సీఎం రేవంత్ రెడ్డి కాపాడుతున్నట్లు తెలిపారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి లక్షల కోట్లను దారి మళ్లించగా, ఆ డబ్బుతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వివరించారు.

చేగుంట వడియారం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ప్రారంభం

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం, చేగుంట, జనవరి21:

చేగుంట వడియారం రైల్వే స్టేషన్ లో రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ను మెదక్ ఎంపీ రఘునందన్ రావు బుధవారం ప్రారంభించారు. రైల్వే శాఖ అధికారులతో కలిసి టికెట్ రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ను అట్టహాసంగా ఆయన ప్రారంభించారు. తాను దుబ్బాక ఎమ్మెల్యేగా కొనసాగిన సమయంలో ప్రజల విజ్ఞప్తుల మేరకు రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి ఒప్పించడం జరిగిందని రఘునందన్ రావు పేర్కొన్నారు. తాను మెదక్ ఎంపీగా కొనసాగుతున్న సమయంలో రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ ను ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. చేగుంట ప్రాంతంలో కర్మాగారాలు ఉన్నందున ఇతర రాష్ట్రాలకు వెళ్లే కార్మికులకు బుకింగ్ కౌంటర్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే సౌకర్యం రైల్వే శాఖలో ఉందన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లే వలస కార్మికులకు పేద ప్రజలకు వడియారం రైల్వే స్టేషన్ లో బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయడం మేలు చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ మేనేజర్ కామారెడ్డి రైల్వే పోలీసులు ప్రజా ప్రతినిధులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



పంచాక్షరి నామం పరమపద సోపానం

- భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామరాజు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 21:

మార్కండేయ స్వామి జయంతిని పురస్కరించుకొని పసుపు బియ్యం, టీ పొడిని ఉపయోగించి మార్కండేయు, శివ లింగం అద్భుత చిత్రాలను చిత్రించి బుధవారం నాడు రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామ కోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ అల్పాయుష్ కలవాడు మార్కండేయుడని "ఓం నమశ్శివాయ" అనే పంచాక్షరీ మంత్రాన్ని అనునిత్యం పఠించడం వల్ల దీర్ఘాయుష్‌ను పొందరన్నారు. శివ మార్కండేయుని అపారమైన భక్తి శక్తి మనలో అందరికీ రావాలని కోరారు.

వసంత పంచమికి సరస్వతి ఆలయం సిద్ధం

- క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 21:

తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ విద్యా సరస్వతి క్షేత్రంలో ఈనెల 23వ తేదీన జరగనున్న వసంత పంచమి (శ్రీ పంచమి) మహోత్సవ విజయవంతానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి తెలిపారు. కంచి పీఠాధిపతి, జగద్గురువులు, విజయేంద్ర సరస్వతి స్వామి సంపూర్ణ ఆశీస్సులతో ముందుకెళ్తుండగా, పుష్పగిరి పీఠాధిపతి, పరివ్రాజకాచార్యులు, జగద్గురువులు విద్యాశంకర భారతి తీర్థ స్వామీజీ కరకమలములచే శుక్రవారం తెల్లవారు జామున శ్రీ వసంత పంచమి మహోత్సవానికి అంకురార్పణ జరగనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేష పంచామృతాభిషేకం, గణపతి పూజ, చండీ హోమం, ప్రత్యేక పూజలు, పల్లకి సేవ, లక్ష పుష్పార్చన, చెప్పన్ బోగ్ నివేదన, విద్యాజ్యోతి దివ్య దర్శనం, గురు మదనానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా శారద స్మార్త వేద విద్యాలయ విద్యార్థులకు "జయ" పట్టా ప్రధానం తదితర కార్యక్రమాలు ఉంటాయని సిద్ధాంతి చంద్రశేఖర శర్మ స్పష్టం చేశారు. ఈ మహోత్సవానికి 50 వేలకు పైగా భక్తులు హాజరుకానుండగా, వేల సంఖ్యలో అక్షర స్వీకారాలు జరుగుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు పూర్తి చేసినట్లు వివరించారు.

ఏడుపాయల హుండీ ఆదాయం 52 లక్షల రూపాయలు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 21:-

తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం 61 రోజులకు గాను హుండీ ఆదాయం 52 లక్షల 42 వేల 905 రూపాయలు వచ్చింది అని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు బుధవారం దేవాలయం ప్రాగణంలో గల గోకుల్ షెడ్ లో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు * కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధిక స్పెషల్ ఆఫీసర్ సులోచన. మెదక్ ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు. పాపన్నపేట్ పోలీస్ లు బందబస్తు నిర్వహించారు.

గజ్వేల్ మున్సిపల్‌కు నూతన కమిషనర్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 21:

గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గా వెంకట గోపాల్ నియమితులయ్యారు. జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న ఆయనను ఎన్నికల బదిలీలో భాగంగా ప్రభుత్వం బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గోపాల్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు.

సిద్దిపేట ఆర్డీవో కార్యాలయ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు

- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయ ప్రతిష్టకు మచ్చ?

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 21:

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న రెవిన్యూ డివిజనల్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయ పరిసరాల్లోనే అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఆర్డీవో కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ల్యాండ్ ఆక్విజిషన్ కార్యాలయం చుట్టూ ఖాళీ మద్యం సీసాలు దర్శనమివ్వడం కలకలం రేపుతోంది. విలువైన ప్రభుత్వ పత్రాలు, కీలక ఫైళ్లు భద్రపరిచే ల్యాండ్ ఆక్విజిషన్ కార్యాలయానికి సంబంధించిన వెనుక గేటు తరచుగా తెరిచి ఉండటంతో బయటి వ్యక్తులు ఎలాంటి అడ్డంకులు లేకుండా లోనికి ప్రవేశిస్తున్నట్టు సమాచారం. ఈ పరిస్థితిని అవకాశంగా మలచుకుని కొందరు వ్యక్తులు అక్కడికి వచ్చి మద్యం సేవిస్తూ హంగామా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలోనే ఇలాంటి దృశ్యాలు కనిపించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పెద్దగా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయ పరిసరాల్లో భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ తరహా అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులు, విలువైన పత్రాల భద్రతపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక మరోవైపు, అప్పుడప్పుడు కార్యాలయ సిబ్బంది విందులు నిర్వహిస్తున్నట్టు సమాచారం కూడా వెలుగులోకి రావడం ఈ వ్యవహారాన్ని మరింత వివాదాస్పదంగా మారుస్తోంది. ఈ పరిణామాలన్నీ కలిసి ప్రభుత్వ కార్యాలయ గౌరవానికి భంగం కలిగిస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేపు ఎలాంటి అనూహ్య ఘటన జరిగితే బాధ్యత ఎవరిది అన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆర్ డి ఓ కార్యాలయ ఆవరణ మరింత వివాదాలకు కేంద్రంగా మారే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.



'సీఎం అక్రమ పద్ధతితో తన బావమరిదికి టెండర్‌ను కట్టబెట్టారు. దొంగే పోలీస్ స్టేషన్ కు వచ్చి తనపై విచారణ జరపాలని కోరతాడా? బీఆర్ఎస్ బయటపెట్టిన సింగరేణి స్కామ్‌పై కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి తీరు అలాగే ఉంది. ఇది మీ అజ్ఞానమా లేక రేవంత్‌తో బీజేపీకున్న చీకటి ఒప్పందమా?

- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

సామాన్యుని పాలిట బడ్జెట్ వరమా?

వచ్చిన డబ్బులు వచ్చినట్టే ఉంటాయి..కానీ చేతిలో ఒక్క పైసా కనిపించదు. ఇదీ భారతదేశంలో మధ్య తరగతి వాళ్ళ పరిస్థితి. దీనికి కారణం అన్ని ధరలూ విపరీతంగా పెరిగిపోవడం, ద్రవ్యోల్బణం. కానీ మధ్య తరగతి వాళ్ళ జీతాలు మాత్రం పెద్దగా పెరగడం లేదు. ఒకవేళ పెరిగినా అవి పేపర్ మీద మాత్రమే కనిపిస్తాయి. ట్యాక్స్ లు పోయి చేతికి వచ్చేది మాత్రం ఎప్పటిలా బెత్తెడే ఉంటుంది. క్రితంసారి బడ్జెట్ లో ట్యాక్స్ స్లాబ్ లను కొద్దిగా మార్చారు. కానీ అది కంటి తుడుపు చర్యగానే మిగిలిపోయింది. దీంతో ఈ సారి బడ్జెట్ లో 30 శాతం ఇన్‌కమ్ ట్యాక్స్ స్లాబ్ ను సవరించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. దీనిపై సామాన్యుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి. ప్రస్తుతం ట్యాక్స్ స్లాబ్స్ ప్రకారం..ఆదాయం ఒక పరిమితి దాటితే 30 శాతం పన్ను కట్టాల్సి వస్తోంది. జీతం పెరిగినా టాప్ ట్యాక్స్ బ్రాకెట్ లోకి వెళ్ళిపోతోంది. కానీ కొనుగోలు శక్తి మాత్రం పెరగడం లేదు. ఇది మారాలంటే.. ప్రస్తుతం రూ. 24 లక్షల పైన ఉన్న 30 శాతం స్లాబ్ ను కనీసం రూ. 35 లక్షల వరకు పెంచాలి. అప్పుడే మధ్యతరగతి ప్రజల చేతిలో తగినంత డబ్బు మిగులుతుందని ట్యాక్స్ నిపుణులు చెబుతున్నారు. మనం కొనే వస్తువుల ధరలు ప్రతి ఏటా పెరుగుతుంటాయి. కానీ, మన ట్యాక్స్ ఫ్రీ లిమిట్ మాత్రం అలాగే ఉంటుంది. దీనినే బ్రాకెట్ క్రీప్ అంటారు. అంటే ధరలు పెరిగినా..జీతం పెరగదు, రియల్ ఆదాయమూ పెరగదు. అందుకే ట్యాక్స్ స్లాబ్‌లను 'కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ తో లింక్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ధరలు పెరిగినప్పుడు దానికి అనుగుణంగా ట్యాక్స్ లిమిట్ కూడా ఆటోమేటిక్‌గా పెరుగుతుందని చెబుతున్నారు. ట్యాక్స్ స్లాబ్ లు మార్చడం వలన ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కొంత తగ్గవచ్చును కానీ మరో రూపంలో ఆర్థిక వ్యవస్థకు లాభం చేకూరుతుంది. దీని వలన జీఎస్టీ పెరుగుతుంది. ప్రజలు కార్లు, ఎలక్ట్రానిక్స్, ఇతర వస్తువులు కొంటే ప్రభుత్వం పరోక్ష పన్నుల రూపంలో లాభపడుతుంది.

విశ్వ వీక్షణం

డా. కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
7702417779
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా.ధనుంజయ హాస్పిటల్, హైదారాబాద్

HbA 1C టెస్ట్ అంటే ఏంటి.. ఇది ఎందుకు చేస్తారు?

ఈ మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా వయసుతో సంబంధం లేకుండా అందరూ డయాబెటిస్ తో బాధపడుతున్నారు. శరీరం ఇన్సులిన్ ఉత్పత్తిని ఆపేసినప్పుడు లేదా ఇన్సులిన్ నిరోధకతను అభివృద్ధి చేసినప్పుడు డయాబెటిస్ వస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. నియంత్రణ కూడా కష్టమవుతుంది. డయాబెటిస్ ఉన్న వారికి దాని లక్షణాలు చెప్పడంతోపాటు వైద్యులు HbA1c పరీక్ష చేయించుకోవాలి అని సలహా ఇస్తూ ఉంటారు.

HbA1C పరీక్ష అంటే?

మనం తినే ఆహారాన్ని బట్టి జీర్ణాశయం నుంచి రక్తంలోకి గ్లూకోజ్ విడుదలవుతుంది. అది రక్తంలో స్వేచ్ఛగా అటూ ఇటూ తిరుగుతుంది. అయితే రక్తంలో రకరకాల ప్రోటీన్లు కూడా ఉంటాయి. శరీరంలోని అన్ని భాగాలకూ ఆక్సిజన్ సరఫరా చేసే ఎర్ర రక్త కణాల్లో ఉండే హిమోగ్లోబిన్ కూడా వాటిలో ఒకటి. ఈ హిమోగ్లోబిన్ కి స్వేచ్ఛగా తిరిగే గ్లూకోజ్ మాలిక్యూల్ అంటుకుంటుంది. దీన్నే గ్లైకేషన్ అంటారు. ఇలా గ్లూకోజ్ అంటుకున్న హిమోగ్లోబిన్ ను గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్ అంటారు. ఎర్ర రక్త కణాల జీవిత కాలం రెండు, మూడు నెలలే కాబట్టి, గత మూడు నెలలుగా గ్లూకోజ్ (చక్కెర) వీటికి ఎంత మేరకు అతుక్కుందో సూచిస్తుంది. ఎక్కువ శాతం చక్కెర రక్తంలో తిరుగుతూ ఉంటే, ఎక్కువ శాతం హిమోగ్లోబిన్ కు అతుక్కుంటుంది. అదే ఈ పరీక్ష లో తెలుస్తుంది. HbA1C పరీక్షను A1C పరీక్ష లేదా గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్ లేదా హిమోగ్లోబిన్ A1C పరీక్ష అని కూడా పిలుస్తారు. రక్తంలో గ్లూకోజ్ అంటుకొని ఉన్న హిమోగ్లోబిన్ ప్రోటీన్ మొత్తాన్ని ఈ పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు.

3 నెలల సగటు చక్కెర స్థాయిలు..

గత 3 నెలలు (8 నుండి 12 వారాలు)గా రక్తంలోని గ్లూకోజ్ స్థాయిని HbA1C సూచిస్తుంది. అంటే నిన్న, మొన్న తిన్న ఆహారం వల్ల కాకుండా, గత మూడు నెలలుగా మనం తీసుకునే ఆహారాన్ని బట్టి రక్తంలో షుగర్ శాతం ఎంత ఉందో తెలుపుతుంది. ఈ పరీక్ష డయాబెటిస్ ఉన్న వారికి రక్తంలో చక్కెర స్థాయులను పరీక్షించడానికి, అలాగే షుగర్ ముందు స్టేజీ (ప్రీడయాబెటిస్), షుగర్ (మధుమేహం/డయాబెటిస్)ని గుర్తించడం కోసం ఉపయోగపడుతుంది. ఈ పరీక్షకు ఉపవాసం ఉండాల్సిన పనిలేదు. తినే ఆహారంతో నిమిత్తం లేకుండా రోజులో ఎప్పుడైనా ఈ పరీక్ష చేయవచ్చు.
షుగర్ వ్యాధి లేని వారందరికీ హిమోగ్లోబిన్ A1C స్థాయి సాధారణంగా 4% నుంచి 5.6% మధ్య ఉంటుంది. హిమోగ్లోబిన్ A1C స్థాయి 5.7% నుంచి 6.4% మధ్య ఉంటే ప్రీడయాబెటిస్ స్థాయి అని, ముందు ముందు వీరికి మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని అర్థం. ఈ విలువ 6.5% లేదా అంతకన్నా ఎక్కువ ఉంటే షుగర్ వ్యాధి ఉందని అర్థం.

ఎవరు చేయించు కోవాలి

45 ఏళ్లు పైబడిన వారు ఏడాదికోసారి ఈ పరీక్ష చేయించుకోవడం మంచిది. తల్లిదండ్రులకు, అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు డయాబెటిస్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఏడాదికోసారి HbA1C పరీక్ష చేయించుకోవడం మంచిది. అధిక బరువు, రక్తపోటు, గుండె జబ్బులు ఉన్నవారు, 30 నుండి 45 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు ప్రతి రెండేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకోవాలి. ఇది వ్యాధి తీవ్రతను నిర్ణయించడమే కాకుండా తగిన చికిత్స తీసుకోవడంలో, జీవనశైలిలో మార్పులకు సహాయపడుతుంది. డయాబెటిస్, దాని లక్షణాలతో బాధపడే వారే కాకుండా ఆరోగ్యకరమైన వ్యక్తులు కూడా HbA1c రక్తపరీక్ష చేయించుకోవచ్చు. దీని వల్ల డయాబెటిస్ బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. అయితే, కేవలం HbA1C పరీక్షను బట్టి మీ వైద్యులు మందులు సూచించలేరు. ఉపవాసం, భోజనం తర్వాత వచ్చే మధుమేహ రక్త పరీక్షల విలువలను బట్టి మాత్రమే చక్కెరను నియంత్రించే సరైన మందులను వైద్యులు రాయగలరు.. ముఖ్యంగా కొన్ని రుగ్మతలకు ఈ పరీక్షతో పాటు వేరే పరీక్షలు నిర్వహించాలి.. హిమోగ్లోబిన్ తో పాటు అల్బుమిన్, ఫరిటిన్, ఫైబ్రినోజెన్ వంటి ప్రోటీన్లకు కూడా గ్లూకోజ్ అతుక్కుంటుంది. కానీ అందరికీ ఈ పరీక్షలు అవసరం ఉండవు. సివియర్ ఎనీమియా (రక్తంలో హిమోగ్లోబిన్ శాతం చాలా తక్కువగా) ఉన్న వారికి, కిడ్నీల సమస్య వలన రక్తం సరిగా ఉత్పత్తి కాని వారికి, హీమోఫీలియా లాంటి రక్త సంబంధ వ్యాధులు ఉన్న వారికి, లివర్ సంబంధిత రోగాలు ఉన్నవారికి HbA1C పరీక్ష ఫలితాలు నమ్మదగినవిగా ఉండవు. అలాంటివారికి మాత్రమే వేరే ప్రోటీన్‌లకు అతుక్కుని ఉన్న గ్లూకోజ్ శాతం పరీక్షలు అవసరం అవుతాయి..



పైన ఇచ్చిన సూచనలు ఒక అవగాహన కోసమే మీకు ఆరోగ్యపరమైన ఏ అవసరం వచ్చినా వైద్యులను సంప్రదించి మాత్రమే నిర్ణయం తీసుకోగలరు.

ఢిల్లీలో హై అలర్ట్..

దేశ రాజధానిలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దేశం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతుండగా ఉగ్రవాదులు దేశ రాజధానిని రక్తసిక్తం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. జనవరి 26ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు ప్లాన్ చేయడంతో దీనికి ఉగ్రవాదులు 'కోడ్ నేమ్ 26 26' అని పేరు పెట్టినట్లు సమాచారం. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ డైరెక్షన్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ఈ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. కేవలం ఢిల్లీ మాత్రమే కాకుండా, జమ్మూ కాశ్మీర్, అయోధ్యలోని రామ మందిరం కూడా వీరి టార్గెట్ లిస్టులో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. స్థానిక గ్యాంగ్‌స్టర్లు, సోషల్ మీడియా ద్వారా రాడికలైజ్ అయిన యువతను ఉపయోగించి 'లోన్ ఉల్ఫ్' దాడులు చేయవచ్చని నిఘా విభాగం హెచ్చరించింది.ఈ ముప్పును తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ పోలీసులు , కీలక ఉగ్రవాదుల ఫొటోలతో కూడిన 'వాంటెడ్' పోస్టర్లను నగరం అంతటా ప్రదర్శిస్తున్నారు. మొహమ్మద్ రెహాన్: అల్ ఖైదాకు చెందిన ఇతను ఢిల్లీ నివాసిగా గుర్తించారు.షాహిద్ ఫైసల్: గతంలో బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ బాంబు పేలుడులో ప్రధాన సూత్రధారి.వీరితో పాటు మరికొందరు అనుమానిత ఉగ్రవాదులు ఢిల్లీలోకి ప్రవేశించే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.వేడుకలు జరిగే కర్తవ్య పథ్, ఎర్రకోట, రద్దీగా ఉండే మెట్రో స్టేషన్ల వద్ద నిఘా ముమ్మరం చేశారు. ఢిల్లీ ఆకాశంలో డ్రోన్లు, పారాగ్లైడర్లు ఎగరకుండా నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. ఎయిర్ ఫోర్స్ ప్రదర్శన సమయంలో పక్షులు అడ్డురాకుండా ఉండేందుకు డేగలకు ప్రత్యేకంగా ఆహారం వేసి వాటిని దారి మళ్లించే వినూత్న పద్ధతులను కూడా అనుసరిస్తున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద వస్తువు లేదా వ్యక్తి కనిపిస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

గ్రీన్‌లాండ్‌కు అమెరికానే దిక్కు..

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌లాండ్ ఐల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న తన కోరికను మరోసారి బయటపెట్టాడు. అమెరికా తప్ప మరే దేశమూ గ్రీన్‌లాండ్‌కు రక్షణ కల్పించలేదని స్పష్టం చేశారు. దావోస్ వేదికగా ప్రపంచ దేశాధినేతల సమక్షంలో ప్రసంగించిన ట్రంప్, గ్రీన్‌లాండ్‌ను అమెరికా భూభాగంగా మార్చుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. "గ్రీన్‌లాండ్‌ను రక్షించే సామర్థ్యం అమెరికాకు తప్ప మరే ఇతర దేశానికి లేదా దేశాల సమూహానికి లేదు. ఇది కేవలం అమెరికా జాతీయ భద్రతకే కాదు, ప్రపంచ భద్రతకు కూడా అత్యంత కీలకం" అని ఆయన పేర్కొన్నారు.గ్రీన్‌లాండ్ ప్రస్తుతం డెన్మార్క్ పరిధిలో ఉన్నప్పటికీ, అక్కడ రక్షణ వ్యవస్థలు చాలా బలహీనంగా ఉన్నాయని ట్రంప్ విమర్శించారు. "రష్యా, చైనాల యుద్ధ విమానాలు, జలాంతర్గాములు అక్కడ తిరుగుతుంటే.. వారి వద్ద కేవలం రెండు కుక్కల బండ్లు మాత్రమే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వారు ఆ ద్వీపాన్ని ఎలా రక్షించుకోగలరు?" అని ఆయన ఎద్దేవా చేశారు.రెండో ప్రపంచ యుద్ధం సమయంలో డెన్మార్క్ కేవలం ఆరు గంటల్లోనే జర్మనీకి లొంగిపోయిందని, అప్పట్లో అమెరికానే తన బలగాలను పంపి గ్రీన్‌లాండ్‌ను రక్షించిందని గుర్తుచేశారు. యుద్ధం తర్వాత దానిని తిరిగి ఇచ్చేయడం అమెరికా చేసిన "తెలివితక్కువ పని" అని ఆయన వ్యాఖ్యానించారు. గ్రీన్‌లాండ్ అంశంలో అమెరికాకు వ్యతిరేకంగా నిలుస్తున్న ఐరోపా దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్‌లాండ్ కొనుగోలుకు మద్దతు ఇవ్వని ఎనిమిది ఐరోపా మిత్రదేశాలపై 10 శాతం నుంచి 25 శాతం వరకు సుంకాలు విధిస్తానని ఇప్పటికే ఆయన హెచ్చరించారు.ఈ మధ్యే ట్రంప్ ఒక AI రూపొందించిన చిత్రాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అందులో గ్రీన్‌లాండ్‌పై అమెరికా జెండా ఉండి, "US Territory Est. 2026" అని రాసి ఉంది. ఇది అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో పెను దుమారం రేపింది. గ్రీన్‌లాండ్ విషయంలో ఎవరూ వెనక్కి వెళ్లే ప్రసక్తి లేదని, దావోస్ పర్యటనలో ఇతర దేశాధినేతలతో దీనిపై చర్చలు జరిపి ఒక పరిష్కారానికి వస్తామని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై డెన్మార్క్, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. గ్రీన్‌లాండ్ "అమ్మకానికి లేదు" అని డెన్మార్క్ ప్రభుత్వం తేల్చి చెప్పగా, ట్రంప్ చర్యలను "కొత్త వలసవాదం"గా ఐరోపా దేశాలు అభివర్ణిస్తున్నాయి. గ్రీన్‌లాండ్ అంశం వల్ల నాటో (NATO) కూటమిలో చీలిక వచ్చే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ

రూపాయి పతనం కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. బుధవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూపాయి విలువ 91.74 వద్ద కనిష్ఠానికి చేరింది. రూపాయికి ఇప్పటివరకు ఇదే కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు తమ నిధులు తరలించడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఆలస్యం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

చరిత్ర సృష్టించిన ఇంగ్లండ్ యువ బ్యాటర్

ఇంగ్లండ్ యువ బ్యాటర్ బెన్ మేస్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. అండర్ 19 వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన ఇంగ్లండ్ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 ఎడిషన్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో ఇవాళ (జనవరి 21) జరుగుతున్న మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు.ఈ మ్యాచ్‌లో మేస్ కేవలం 65 బంతుల్లో శతక్కొట్టి, మొత్తంగా 117 బంతుల్లో 191 పరుగులు చేశాడు. ఇందులో 18 ఫోర్లు, 8 సిక్సర్లు ఉన్నాయి. మేస్ మరో రెండు పరుగులు చేసుంటే అండర్ 19 వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టు తరఫున అయిన అత్యధిక స్కోర్ చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించి ఉండేవాడు. ఈ ప్రపంచ రికార్డు శ్రీలంక ఆటగాడు విరాన్ చముదిత పేరిట ఉంది. విరాన్ ఇదే ఎడిషన్‌లో జపాన్‌పై 192 పరుగుల చేశాడు. మేస్.. మరో శ్రీలంక ఆటగాడు హసిత బోయగోడాతో కలిసి ఈ విభాగంలో రెండో స్థానంలో నిలిచాడు. హసిత కూడా మేస్ లాగే 191 పరుగుల వద్ద ఆగిపోయాడు. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 404 పరుగుల భారీ స్కోర్ చేసింది. మేస్ భారీ శతకంతో పాటు ఓపెనర్ జోసఫ్ మూర్స్ (81) అర్ధ సెంచరీతో రాణించాడు. లోయర్ మిడిలార్డర్ ఆటగాడు తలో చేయి వేయడంతో ఇంగ్లండ్ 400 పరుగుల మైలురాయిని తాకింది. కెప్టెన్ థామస్ రూ 22, కాలెబ్ ఫాల్క్‌నర్ 32, రాల్ఫీ ఆల్బర్ట్ 13, ఫర్హాన్ అహ్మద్ 15 (నాటౌట్), సెబాస్టియన్ మోర్గాన్ 24 (నాటౌట్) పరుగులు చేశారు.

తొలి టీ20లో భారత్ ఘన విజయం

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత్ 48 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 190/7కి పరిమితమైంది. గ్లెన్ ఫిలిప్స్ (78; 40 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) రాణించగా.. మార్క్ చాప్‌మన్ (39), టిమ్ రాబిన్సన్ (21) డరెల్ మిచెల్ (28), శాంట్నర్ (20*) రన్స్ చేశారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 2, శివమ్ దూబె 2, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 10తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టీ20 శుక్రవారం (జనవరి 23)రాయ్‌పూర్‌లో జరగనుంది.భారత బ్యాటర్లలో ఓపెనర్ అభిషేక్ శర్మ (84; 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. చివర్లో రింకు సింగ్ (44*; 20 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. సూర్యకుమార్ యాదవ్ (32), హార్దిక్ పాండ్య (25) పరుగులు చేశారు. సంజు శాంసన్ (10), ఇషాన్ కిషన్ (8), శివమ్ దూబె (9) నిరాశపర్చారు. సూర్యతో కలిసి అభిషేక్ మూడో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యం (47 బంతుల్లో) నెలకొల్పాడు. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ 2, కైల్ జేమీసన్ 2, క్రిస్టియన్ క్లార్క్, ఇష్ సోధి, మిచెల్ శాంట్నర్ ఒక్కో వికెట్ సాధించారు.ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి 428 పరుగులు చేశాయి. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన టీ20ల్లో ఇదే అత్యధికం.తాజా ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ టీ20ల్లో 5,000 పరుగుల మార్కు అందుకున్నాడు. దీంతో రస్సెల్ (2942)ను అధిగమించి అతి తక్కువ బంతుల్లో (2898) ఈ ఘనత సాధించిన బ్యాటర్‌గా అభిషేక్ రికార్డు సృష్టించాడు.



మూడో రౌండ్‌కు అల్కరాజ్

మెల్‌బోర్న్: తన కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ వేటలో ఉన్న స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాజ్ ఈ టోర్నీ మూడో రౌండ్‌కు చేరాడు. బుధవారం ఇక్కడ జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్కరాజ్ తో పాటు స్టార్ ప్లేయర్లు తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ అల్కరాజ్.. 76 (7/4), 63, 62తో జర్మనీకి చెందిన యానిక్ హన్ఫ్‌మన్‌ను ఓడించాడు.తొలి సెట్ లో కాస్త ప్రతిఘటించిన జర్మనీ ప్లేయర్.. తర్వాత రెండు సెట్స్‌లోనూ అదే పోరాటాన్ని కొనసాగించలేకపోయాడు. 78 నిమిషాల పాటు సాగిన తొలి సెట్ లో 13తో వెనుకబడ్డ స్పెయిన్ కుర్రాడు.. సెట్ ను టైబ్రేక్‌కు తీసుకెళ్లి ఆధిక్యం సాధించాడు.మిగిలిన మ్యాచ్ లలో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ).. 63, 46, 63, 64తో ముల్లర్ (ఫ్రాన్స్)ను ఓడించగా రష్యా ఆటగాడు డానియల్ మెద్వెదెవ్ 67 (9/11), 63, 64, 62తో క్వింటిన్ హేల్స్ (ఫ్రాన్స్)ను చిత్తుచేశాడు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ, అండ్రె గొరన్సన్ (స్వీడన్) ద్వయం.. 63, 64తో జేమ్స్ డక్‌వర్త్, హెవిట్ (ఆస్ట్రేలియా) జోడిని ఓడించి రెండో రౌండ్‌కు చేరింది.మహిళల సింగిల్స్ విషయానికొస్తే రెండో రౌండ్‌లో ఒకటో సీడ్ అరీనా సబలెంకా (బెలారస్).. 63, 61తో జోఉషువాన్ (చైనా)పై సునాయాస విజయం సాధించగా మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 62, 62 ఒల్గా డేనిలోవిక్ (సెర్బియా)ను చిత్తుచేసింది. ఏడో సీడ్ జైస్మిన్ పొలిని (ఇటలీ).. 62, 63తో మగ్దలెనా ఫ్రెచ్ (పోలండ్)పై నెగ్గగా 8వ సీడ్ మిర్రా ఆండ్రీవా (రష్యా) 60, 64తో మరియ సక్కారి (గ్రీక్)ను ఓడించింది.

కోహ్లీని వెనక్కి నెట్టేసిన కివీస్ బ్యాటర్..

ఐసీసీ మెన్స్ వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారెల్ మిచెల్ తొలి స్థానాన్ని ఆక్రమించేశాడు. తాజాగా భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు చేసిన ఆ బ్యాటర్ .. విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టేశాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 9 సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. కేవలం 54 ఇన్నింగ్స్‌ల్లో అతను 9 సెంచరీలు కొట్టాడు. భారత్‌తో జరిగిన సిరీస్‌లో మిచెల్ 352 రన్స్ స్కోరు చేశాడు. డారెల్ మిచెల్ 845 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో 795 పాయింట్లతో కోహ్లీ రెండో స్థానంలో నిలిచాడు. వన్డే క్రికెట్‌లో మిచెల్ మొదటి ర్యాంక్ దక్కించుకోవడం ఇది రెండోసారి.

ప్రతిపక్షం
www.prathipaksham.in
12
హైదరాబాద్
గురువారం
22.01.2026
సినిమా

అనీల్ నెంబర్1!

రాజమౌళి, సుకుమార్, ప్రశాంత్ నీల్, ప్రశాంత్ వర్మ, చందు మొండేటి, బుచ్చిబాబు ఇలా వీళ్లంతా ఇప్పటికే పాన్ ఇండియా డైరెక్టర్లగా మారిపోయారు. వాళ్లంతా పాన్ ఇండియా మార్కెట్ ని దృష్టిలో పెట్టుకునే సినిమాలు చేస్తు న్నారు. ఇంకా చాలా మంది దర్శకులు పాన్ ఇండియా టార్గెట్ గా అడుగులు వేస్తున్నారు. యూనివర్శల్ కాన్సెప్ట్ తో పాన్ ఇండియా మార్కెట్ కు కనెక్ట్ అవ్వాలని ప్లాన్ చేసుకుంటున్నారు. త్రివిక్రమ్, సురేందర్ రెడ్డి, పూరి జగన్నాథ్ ఇలా వీరంతా కూడా పాన్ ఇండియా కోసం తహతహలాడుతున్న వారే. అవకాశం వస్తే ఏక్షణమైనా జంప్ అవ్వడానికి రెడీగా ఉన్నారు. ఇంకా మరికొంత మంది యంగ్ డైరెక్టర్లు కూడా రీజనల్ సినిమా కంటే పాన్ ఇండియా సినిమాకే మొగ్గు చూపుతున్నారు. వీళ్లంతా పాన్ ఇండియాలో బిజీ అయితే గనుక హిట్ మెషిన్ అనీల్ రావిపూడి రీజనల మార్కెట్ లో అతడే నెంబర్ అవుతాడు? అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే అతడికి ఆ నెంబర్ ఇచ్చేయొచ్చు. ఎందుకంటే ఇండస్ట్రీకి అనీల్ ఇచ్చిన సక్సెస్ లు అలాంటివి. తక్కువ బడ్జెట్ లో భారీ లాభాలు ఇచ్చిన కంటెంట్ అతడికి మాత్రమే సాధ్యమైంది. ఇప్పటి వరకూ అతడు తెరకెక్కించిన సినిమాలేవి భారీ బడ్జెట్ తో కూఏడుకున్నవి కాదు.అంతా కలిపి 50 కోట్లలోపే చుట్టేసిన చిత్రాలు. కానీ బాక్సాఫీస్ వద్ద వాటి వసూళ్లు చూస్తే దిమ్మ తిరిగిపోతుంది. డైరెక్ట్ చేసిన తొమ్మిది సినిమాల్లో ఆరు సినిమాలు 100 కోట్ల క్లబ్ లో చేరిన చిత్రాలే. వాటిలో `సంక్రాంతికి వస్తున్నాం` ఏకంగా 300 కోట్ల వసూళ్లను సాధించిన చిత్రమిది. అనీల్ కెరీర్ లో టాప్ గ్రాసర్ ఇదే. ఇటీవలే రిలీజ్ అయిన `మనశంకర వరప్రసాద్ గారు` ఇప్పటికే 300 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. లాంగ్ రన్ లో ఈసినిమా పాత రికార్డులను బ్రేక్ చేస్తుందనే అంచనాలున్నాయి. ఇదంతా అనీల్ రీజనల్ మార్కెట్ లో సాధించిన సక్సెస్ మాత్రమే.హీరోల ఇమేజ్ ను ఆధారంగా చేసుకుని సింపుల్ స్టోరీలతో తెరకెక్కించి హిట్ ఇచ్చాడు. షూటింగ్ సహా సినిమా రిలీజ్ అన్నది అత్యంత వేగంగా చేయడం అనీల్ ప్రత్యేకత. షూటింగ్ పేరుతో నెలల తరబడి సెట్స్ లో కూర్చోడు. నిర్మాతకు అదనంగా బడ్జెట్ పెంచడు. తాను చెప్పిన బడ్జెట్ లోపే ముగించి అందులోనే నిర్మాతకు కొంత మిగులు స్తాడు. ప్రచారానికి దూరంగా ఉన్న వాళ్లను సైతం తన జోవియల్ గుణంతో ఒప్పించి తీసుకొస్తాడు. పెద్ద పెద్ద స్టార్లను సైతం తన దారిలోకి తెచ్చుకుంటాడు. ఇన్నీ పాజిటివ్ లక్షణాలున్న అనీల్ రావిపూడి టాలీవుడ్ నెంబర్ వన్ డైరెక్టర్ అవ్వడానికి ఎంతో సమయం పట్టదు.

ఆ పండగ బరిలో క్రేజీ 'జాంబీలు'

హనుమాన్, మిరాయ్ సినిమాలతో వరుస హిట్లు కొట్టి ఫుల్ జోష్‌లో ఉన్న యంగ్ హీరో తేజ సజ్జా, ఇప్పుడు తన లైనప్‌ను మరింత క్రేజీగా మార్చేస్తున్నాడు. తన కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ హిట్ అయిన 'జాంబీ రెడ్డి'కి ఇప్పుడు సీక్వెల్ రెడీ అవుతోంది. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి వినిపిస్తున్న ఒక షాకింగ్ అప్‌డేట్ ఏంటంటే, ఈ పార్ట్ 2ని ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేయడం లేదు. 'జై హనుమాన్' పనుల్లో బిజీగా ఉండటం వల్ల ఆయన ఈ బాధ్యతను బాలీవుడ్ డైరెక్టర్‌కు అప్పగించారు.బాలీవుడ్‌లో పాపులర్ అయిన 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ కోరైటర్, 'హక్' డైరెక్టర్ సుపర్ణ్ వర్మ ఈ 'జాంబీ రెడ్డి 2'ను తెరకెక్కించబోతున్నారు. సుపర్ణ్ ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసి, ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. బాలీవుడ్ మేకింగ్ స్టైల్ తో మన ఊరి జాంబీలను ఈసారి మరింత భయంకరంగా, ఫన్నీగా చూపించబోతున్నారని తెలుస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ భారీ ప్రాజెక్టును నిర్మిస్తోంది.ఇక అసలు విషయానికి వస్తే, ఈ సినిమాను 2027 సంక్రాంతి బరిలో దించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే వచ్చే ఏడాది సంక్రాంతికి పెద్ద సినిమాల రద్దీ కనిపిస్తున్నా, తేజ సజ్జా మాత్రం తన ఫేవరెట్ సీజన్‌ను వదులుకోవడానికి సిద్ధంగా లేడు. ఈ ఏడాది చివర్లో షూటింగ్ స్టార్ట్ చేసి, శరవేగంగా పూర్తి చేసి పండగ కానుకగా రిలీజ్ చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. జాంబీ కాన్సెప్ట్ కు పండగ సెలవులు తోడైతే బాక్సాఫీస్ దగ్గర మళ్ళీ మ్యాజిక్ రిపీట్ అవుతుందని మేకర్స్ నమ్ముతున్నారు.తేజ సజ్జా ప్రస్తుతం అంతా సీక్వెల్స్ మోడ్‌లోనే ఉన్నాడు. 'జాంబీ రెడ్డి 2' పూర్తి చేసిన వెంటనే 'మిరాయ్ 2' షూటింగ్‌లో జాయిన్ అవుతాడు. మిరాయ్ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో దాని సీక్వెల్ పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. వరుసగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లోనే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ తేజ తన మార్కెట్ పెంచుకుంటున్నాడు. చిన్న సినిమాగా వచ్చి సెన్సేషన్ క్రియేట్ చేసిన జాంబీ రెడ్డికి ఈ సీక్వెల్ ఎంతవరకు ప్లస్ అవుతుందో చూడాలి.2027 సంక్రాంతి రేసు అప్పుడే మొదలైపోయింది. వెంకటేష్ 'దృశ్యం 3' వంటి సినిమాలతో పాటు మరికొన్ని వచ్చే సంక్రాంతిని ఫోకస్ చేస్తున్నాయి. ఇప్పుడు తేజ సజ్జా 'జాంబీ రెడ్డి 2' కూడా ఈ రేసులోకి చేరిపోయింది. బాలీవుడ్ డైరెక్టర్ మేకింగ్‌లో జాంబీలు ఈసారి ఎలాంటి రచ్చ చేస్తారో వేచి చూడాలి.

వెంకీ మామ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్!

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ హీరోగా జీతూ జోసెఫ్ తెరకెక్కించిన సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ `దృశ్యం`. మలయాళంలో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న ఈ మూవీకి సంబంధించిన రీమేక్‌లు, సిరీస్‌లు అన్ని భాషల్లోనూ బ్లాక్ బస్టర్ హిట్‌లుగా నిలిచి థార్డ్ ఇన్స్‌స్టాల్‌మెంట్‌లపై అంచనాల్ని పెంచేసింది. ఈ సిరీస్‌లో ఇప్పటికే దృశ్యం, దృశ్యం 2 ప్రేక్షకుల ముందుకొచ్చాయి. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో రెండు భాగాలు రీమేక్ అయి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌లుగా నిలిచాయి.తమిళంలో కేవలం ఫస్ట్ పార్ట్ మాత్రమే రీమేక్ చేశారు. రెండవ భాగం రీమేక్ చేయలేదు. ఇప్పుడు మూడవ భాగం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మోహన్‌లాల్, మీనా జంగటా జీతూ జోసెఫ్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కూడా పూర్తయిపోయింది. `గతం ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండదు `దృశ్యం 3`రాబోతోంది` అంటూ మూడవ భాగాన్ని ప్రకటించిన టీమ్ రాకెట్ స్పీడుతో షూటింగ్ పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ మూవీని ఏప్రిల్ 2న భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నామంటూ ఇటీవల డైరెక్టర్ జీతూ జోసెఫ్ ప్రకటించడం తెలిసిందే. అయితే హిందీ వెర్షన్‌కు ఈ కథ కాకుండా బాలీవుడ్ వర్గాలు కొత్త కథతో చేస్తున్నారని ప్రచారం జరిగింది. అయితే అందులో ఎలాంటి నిజం లేదని తాను అందించిన కథకే హిందీ నేటివిటీకి కొన్ని మార్పులు చేసి రూపొందిస్తున్నారని. దీన్ని అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారని దర్శకుడు క్లారిటీ ఇవ్వడంతో ఇప్పుడు అందరి దృష్టి తెలుగు రీమేక్‌పై పడింది. అయితే మక్షమన్ లాల్ సినిమాలు తెలుగులోనూ డబ్ అయి విజయవంతం అవుతున్న నేపథ్యంలో `దృశ్యం 3`ని వెంకటేష్ తెలుగులో రీమేక్ చేయకపోవచ్చనే కామెంట్‌లు వినిపించాయి.వెంకీ టీమ్ నుంచి కూడా ఇంత వరకు ఈ రీమేక్‌కు సంబంధించి ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో ఇక తెలుగులో `దృశ్యం 3`రీమేక్ లేనట్టేనని అంతా భావించారు. కానీ అది నిజం కాదని తెలుస్తోంది. ఈ మూవీ తెలుగు రీమేక్‌కు సంబంధించిన వర్క్ జూలైలో మొదలవుతుందని, అప్పుడే షూటింగ్ కూడా మొదలు పెడతారని తెలిసింది. మలయాళ `దృశ్యం 3`కి సంబంధించిన రిలీజ్ ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్న తరువాత దర్శకుడు జీతూ జోసెఫ్ తెలుగు రీమేక్ పనులు ప్రారంభిస్తారట. `సంక్రాంతికి వస్తున్నాం` బ్లాక్ బస్టర్ తరువాత వెంకటేష్ ప్రస్తుతం త్రివిక్రమ్ రూపొందిస్తున్న `ఆదర్శకుటుంబం హౌస్ నం.47`లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీ తరువాతే వెంకటేష్ `దృశ్యం 3`షూటింగ్‌కు డేట్స్ కేటాయిస్తాడట. జూన్, జూలై వరకు `ఆదర్శకుటుంబం హౌస్ నం.47` చాలా వరకు షూటింగ్ పూర్తవుతుంది కాబట్టి `దృశ్యం 3`ని స్టార్ట్ చేయాలనే ఆలోచనలో టీమ్ ఉన్నట్టుగా ఇన్ సైడ్ టాక్.

'ఫంకీ'తో సక్సెస్ దక్కేనా..?

సంక్రాంతి సందడి తర్వాత బాక్సాఫీస్ ప్రస్తుతం సైలెంట్‌గా ఉంది. జనవరి నెలాఖరులో తరుణ్ భాస్కర్ 'ఓం శాంతి శాంతి శాంతిః' తప్ప పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అందరి చూపు ఇప్పుడు ఫిబ్రవరి 13న విడుదలయ్యే విశ్వక్ సేన్ 'ఫంకీ' పైనే ఉంది. అనుదీప్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం వాయిదా పడే ఛాన్స్ లేదని ఇటీవల ఓ పోస్టర్ ద్వారా క్లారిటీ ఇచ్చారు.గతేడాది వచ్చిన 'లైలా' డిజాస్టర్ కావడంతో విశ్వక్ ఈ మూవీపైనే ఆశలు పెట్టుకున్నాడు. ఆ విమర్శల తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న ఆయన, రీసెంట్‌గా 'లెగసీ' అనే పొలిటికల్ థ్రిల్లర్‌ను కూడా స్టార్ట్ చేసి అప్పుడే సగం షూటింగ్ పూర్తి చేశాడు. సక్సెస్ కొట్టాలనే పట్టుదలతో 'ఫంకీ' కోసం విశ్వక్ గట్టిగానే కష్టపడ్డాడు. 'జాతిరత్నాలు' తర్వాత అనుదీప్ కూడా హిట్ కోసం ఈ ఫన్ సబ్జెక్ట్‌ను నమ్ముకున్నాడు.ఈ సినిమాలో విశ్వక్ సినిమా దర్శకుడిగా కనిపించబోతున్నాడు. అందాల భామ కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే రిలీజ్‌కు సమయం తక్కువగా ఉన్నందున ప్రమోషన్స్ పెంచాల్సి ఉంది. దీనికి పోటీగా మరుసటి రోజున 'సీతా పయనం', 'కపుల్ ఫ్రెండ్లీ' వంటి సినిమాలు కూడా లైన్లో ఉన్నాయి. మరి ఈ పోటీలో 'ఫంకీ' ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200